
0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్



Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.



RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 253 విశాఖపట్నం, 23 జూలై 2023 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## ప్రతిపక్షాల కూటమికి సుబ్బారెడ్డి సవాల్

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ- జనసేన ఉమ్మడిగా పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వకూడదనే ఉద్దేశంతో భారతీయ జనతా పార్టీని కూడా కలుపుకొని వెళ్లే దిశగా ఆ రెండు పార్టీలు తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నాయి.

అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఓడించడమే లక్ష్యంగా కలిసి పని చేస్తామంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ పలు సందర్భాల్లో వ్యాఖ్యా నించారు. తన ఢిల్లీ పర్యటనలోనూ ఆయన ఇదే అంశాన్ని బీజేపీ అధిష్ఠానం వద్ద ప్రస్తావించినట్లు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర స్థాయిలో



టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు సాధ్యపడు తుందనీ ఆయన వ్యాఖ్యానించారు.

ఈ పరిణామాలపై వైఎస్ఆర్సీపీ సీనియర్ నేత, తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి స్పందించారు. ప్రజాక్షేత్రంలో తమను ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము ధైర్యం తెలుగుదేశం, జనసేన పార్టీలకు లేదంటూ ఎద్దేవా చేశారు. తాము గెలుస్తామనే నమ్మకం లేకపోవడం వల్లే ఆ రెండు పార్టీలు పొత్తుల కోసం అర్రులు చాస్తున్నాయని చురకలు అంటించారు.

శనివారం ఆయన కాకినాడ జిల్లాలో పర్యటించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా, వేర్వేరుగా వచ్చినా చివరికి రామోజీరావును వెంటబెట్టుకుని వచ్చినా తమ పార్టీకి ఓటమి అనేది ఉండబోదని వైవీ సుబ్బారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా నాయకుడని కితాబిచ్చారు.

జనం మద్దతు జగన్‌కే ఉంటుందని వైవీ సుబ్బారెడ్డి తేల్చి చెప్పారు. ముందస్తు ఎన్నికలు జరిగినా షెడ్యూల్ ప్రకారమే వచ్చినా గెలుపు తమదేనని పేర్కొన్నారు. మాజీ

(మిగతా 2లో)

## విశాఖ రైల్వే స్టేషన్‌లో వివిధ అంశాలను పరిశీలించిన జీవీఎల్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నూతనంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ సభ్యునిగా నియమింపబడిన సందర్భంగా శనివారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తూ ప్రయాణికుల సౌకర్యాలను, సమస్యలను తెలుసు కుంటూ, వీలు ఉన్న వాటిని తక్షణం పరిష్కరించాలని ఎంపీ జివిఎల్ నర్సింహారావు రైల్వే అధికారులకు సూచించారు.

సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే జనరల్ బోగీ ప్రయాణికుల కోసం తక్కువ ధరకే భోజనం, తాగునీటిని అందించే సదుపాయం సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఐఆర్‌సిటిసి అందుబాటు లోకి తెచ్చింది. తొలి దశలో మొత్తం నాలుగు స్టేషన్లలో (హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, రేణిగుంట) రైల్వేస్టేషన్లలో ఈ సేవలను ప్రారంభిం చారు.

ఈ సందర్భంగా ఆయా స్టేషన్లలో రూ.20, రూ.50కే నాణ్యమైన ఆహారం లభిస్తుంది.

ఇందులో భోజనాన్ని రెండు కేటగిరీలుగా విభజించారు :

1వ కేటగిరీలో : 7పూరీలతో పాటు ఆలు కూర, పచ్చడిని రూ.20కి అందిస్తారు.

2వ కేటగిరీలో : అన్నం, కిచిడీ, ఛోలే-కుల్చే, ఛోలే-భటూరే, పావ్ భాజీ, మసాలా దోశల్లో ఒక దానిని ఎంచు కోవచ్చు. దీని ధరను రూ.50గా నిర్ణయించారు.

అలాగే 200 మిల్లీలీటర్ల ప్యాకేజ్డ్ వాటర్ గ్లాసులను ఆయా కౌంటర్ల వద్ద అందుబాటులో ఉంచడం జరిగింది. ఇటువంటి వాటిని వైజాగ్ స్టేషన్‌లో కూడా అతిత్వరలో ఏర్పాటు చేస్తారు అని తెలిపారు.

## కడప నుండి పురంధేశ్వరి తొలి సమరశంఖారావం

కడప: భారతీయ జనతా పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షురాలిగా బాధ్యత లను స్వీకరించిన కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి ఇక జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టారు. పార్టీని మరింత బలో పేతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలకు పూనుకున్నారు. నియో జకవర్గాలు, జిల్లా స్థాయి నాయకు లతో విస్తృత సమావేశాల్లో పాల్గొని, వారికి దిశానిర్దేశం చేయనున్నారు.

ఇందులో భాగంగా ఆదివారం కడప జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని ప్రొద్దుటూరులో పార్టీ రాయలసీమ జోనల్ స్థాయి నాయ కులతో పురంధేశ్వరి సమావేశం కానున్నారు. బీజేపీ రాష్ట్రశాఖ అధ్య క్షురాలిగా బాధ్యతలను స్వీకరించిన తరువాత ఆమె చేపట్టిన తొలి జిల్లా పర్యటన ఇదే కావడం, అది కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత జిల్లా కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ సమావేశంలో ఉమ్మడి రాయ లసీమ జిల్లాలకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన నున్నారు. కడప, అన్నమయ్య రాయ చోటి, అనంతపురం, శ్రీసత్యసాయి పుట్టపర్తి,

(మిగతా 2లో)



## 'స్వీప్' కార్యక్రమాలతో ఓటర్ నమోదు పెరగాలి : కలెక్టర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు నమోదు చేయించు కోవాలని, దీనిని బాధ్యతగా అందరూ భావించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం ఉత్తర నియోజకవర్గంలో గల లంకపల్లి బుల్లయ్య కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులతో స్వీప్ అవగాహన సదస్సు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు అనేది రాజ్యాంగం మనకు కల్పించిన హక్కని గుర్తుచేశారు. ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా

(మిగతా 2లో)

## స్పిరిట్ ఆఫ్ వైజాగ్ పోస్టర్ విడుదల చేసిన జీవీఎల్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆగస్టు 6వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జరుగనున్న మహిళల నడక కార్యక్రమానికి సంబంధించి స్పిరిట్ ఆఫ్ వైజాగ్ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదుగు బొదుగు లేని నేత పనివారి పనితనాన్ని అందరికీ తెలిసేలా చేనేత చీరలు ధరించి సుమారు 10వేల మంది మహిళలు బీచ్‌రోడ్డులో ప్రదర్శనగా మూడు కిలోమీటర్ల నడక సాగించడం, అనంతరం చేనేత వృత్తిలో జీవిస్తున్న కొందరు మహిళలకు సన్మానం చేయాలనుకోవడం చాలా అద్భుతమైన మరియు ప్రశంసనీయమైన కార్యక్రమం అని మహిళలను అభినందించారు. మన రాష్ట్రంలో కొన్నిలక్షల మంది చేనేతను వృత్తిగా ఎంచుకొని తరతరాలుగా దానిని కొనసాగిస్తూ భారతీయ సంస్కృతిని పరిరక్షిస్తున్నారని, వారికి ప్రభుత్వాల నుండి తగిన ప్రోత్సాహం లభించక పేదరికంలో మగ్గిపోతున్నారని, స్వాతంత్ర్య పోరాట కాలంలో జరిగినట్లుగా విదేశీ వస్త్ర బహిష్కరణో ద్యమం జరపలేకపోయినా, ప్రతీ ఒక్కరూ తాము వినియోగించే దుస్తులలో సగం చేనేత వస్త్రాలకు అవకాశం కల్పిస్తే నేతన్నల జీవితాలలో వెలుగులు కనబడతాయని, వారు రెండుపూటలా భోజనం చేయగలుగుతారని అన్నారు.

ఇటువంటి కార్యక్రమాలు ప్రతీ జిల్లాలోనూ స్పిరిట్ ఆఫ్ వైజాగ్ టీమ్ మహిళలు నిర్వహించాలని, అందుకు తగిన ప్రోత్సాహకులను కూడా ఎంచుకోవాలని, తాను కూడా తనవంతు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని జీవీఎల్ ప్రకటించారు. ఈ సందర్భంగా స్పిరిట్ ఆఫ్ వైజాగ్ టీమ్ మహిళలు జీవీఎల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నిండు మనస్సుతో ఆయన ఇచ్చిన ప్రోత్సాహం తమకు మరింత శక్తిని అందజేసిందని, ఈ కార్యక్రమాన్ని తప్పక విజయవంతం చేస్తామని అన్నారు. కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా జాతీయ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి, నగర మేయర్ హరికుమారి హాజరు కానున్నారని, నగర మహిళలంతా చేనేత చీరలు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ఏయూ విద్యార్థులకు నేవల్ డాక్‌యార్డ్‌లో ఇంటర్న్‌షిప్‌లు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులకు భారత ప్రభుత్వ రక్షణ రంగ విభాగాలలో ఒకటైన నేవల్ డాక్‌యార్డ్‌లో ఇంటర్న్‌షిప్‌లు లభించనున్నాయి. దీనిలో భాగంగా ఇటీవల ఏయూ నావికాదళంతో ప్రత్యేక ఎంఓయూను చేసుకుంది. ఏయూలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రక్షణ రంగ సంస్థలో ప్రత్యక్షంగా ఇంటర్న్‌షిప్ కల్పించే దిశగా ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. దీనిలో భాగంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు నేతృత్వంలో విభాగాధిపతులు, 83 మంది విద్యార్థులతో కూడిన ప్రత్యేక బృందం నేవల్ డాక్‌యార్డ్‌ను సందర్శించారు. ముందుగా ఆచార్యులు, విద్యార్థులకు నావల్ డాక్‌యార్డ్ విధులు, పనితీరుపై అవగాహన కల్పించారు. అనంతరం నేవల్ డాక్‌యార్డ్ అధికారుల బృందం నేతృత్వంలో వివిధ విభాగాలను ఆచార్యులు, విద్యార్థులు ప్రత్యక్షంగా దర్శించారు.

ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు తమ కోర్సులో భాగంగా ప్రత్యక్ష శిక్షణ అందిం చడానికి, దేశ రక్షణ రంగానికి ఉపయుక్తంగా యువతను తీర్చిదిద్దడానికి

(మిగతా 2లో)

## 'జగనన్న సురక్ష'లో అధికారుల నిర్బంధం

### వదిలేదిలేదన్న గ్రామస్థులు



కొత్తపల్లి: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం నాగులపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన అధికారులను స్థానికులు నిర్బంధించారు. తమ సమస్యలను పరిష్కరించిన తరువాతే సభా ప్రాంగణం నుంచి బయటకు వెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల కిందట గ్రామంలో అర్హులైన 600 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కోసం భూములు సేకరించారు. ఆ భూముల్లో స్థలాల విభజన చేయకుండా, సౌకర్యాలు కల్పించకుండా లబ్ధిదారులకు స్థల వివరాలు లేని ఖాళీ పట్టాలు అందజేశారు. అప్పటినుంచి లబ్ధిదారులు తమ స్థలాలు ఎక్కడ అని పలుమార్లు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో స్థలాల్లో ఇంటి నిర్మాణం గురించి తేల్చే వరకు ఎవరూ బయటకు వెళ్లేది లేదంటూ స్థానికులు అధికారులను నిర్బంధించారు. నియోజక వర్గంలో ఎమ్మెల్యే దొరబాబుకు అత్యధిక మెజారిటీ ఇచ్చినా తమ గ్రామంపై ఎందుకింత వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చి తమ సమస్యకు పరిష్కారం చూపితే గానీ, వదిలేది లేదని హెచ్చరించారు.

## నూతన అధ్యక్షురాలి స్వాగతానికి నగర బీజేపీ ఏర్పాట్లు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శనివారం సాయంత్రం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి వి. సూర్యనారాయణ రాజు విచ్చేసారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి మాట్లాడుతూ బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మొదటిసారిగా పార్టీ అధ్యక్ష హోదాలో విశాఖకు విచ్చేస్తున్న సందర్భంగా ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు చేయవలసిన కార్యాచరణ గురించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి




వి. సూర్యనారాయణ రాజు మాట్లా డుతూ ఈనెల 27వ తేదీన విశాఖలో జరగనున్న భారతీయ జనతా పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల జోనల్ సమావేశమునకు విచ్చేస్తున్న మాజీ కేంద్ర మంత్రివర్యులు, నందమూరి తారక రామారావు తనయ దగ్గుబాటి పురందేశ్వరికి ఘన స్వాగతం పలకాలని గాజువాక లంక మైదానం నుండి అనేక సంఖ్యలో కార్లు మరియు బైకులతో ర్యాలీ గా బయలుదేరి ఎన్ఏడీ జంక్షన్, మర్రిపాలెం, కంచరపాలెం మెట్టు, అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్, మహారాణి పార్లర్, అక్కయ్యపాలెం హైవే, గురుద్వారా జంక్షన్, మద్దిలపాలెం, ఇసుకతోట, ఎంవీపీ డబుల్ రోడ్ మీదుగా బీజేపీ జిల్లా కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని, పత్రికా విలేఖరుల సమావేశంలో పాల్గొని, తదుపరి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరుగబోయే ఉత్తరాంధ్ర జోనల్ సమావేశంలో పాల్గొననున్నారని, ఈ మొత్తం కార్యక్రమాలలో బీజేపీ నాయకులూ, కార్యకర్తలు విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి పుట్ట

(మిగతా 2లో)

## (మొదటి పేజీ తరువాయిలు)

### ప్రతిపక్షాల కూటమికి సుబ్బారెడ్డి సవాల్

మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యోదంతంపైనా ఆయన స్పందించారు. వివేకా హత్యోదంతం వెనుక ఎవరున్నారనేది న్యాయస్థానాలు బయటపెడతాయని, ప్రస్తుతం సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని వ్యాఖ్యానించారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వివేకా హత్యకేసు దర్యాప్తు ఆరంభంలో గూగుల్ టేకౌట్‌ను సీబీఐ ఎందుకు ప్రస్తావించలేకపోయిందని, మధ్యలో ఈ అంశాన్ని ఎందుకు తెర మీదికి తీసుకొచ్చిందో అందరికీ తెలిసిన వ్యవహారమేనని ఆయన అన్నారు. న్యాయస్థానాలను పక్కదారి పట్టించేలా సీబీఐ వ్యవహరించిందని ఆయన విమర్శించారు.

### కడప నుండి పురంధేశ్వరి తొలి సమరశంఖారావం

తిరుపతి, చిత్తూరు, నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి పలువురు నాయకులు హాజరు కానున్నారు. రాయలసీమలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు.

అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా చేపట్టాల్సిన నిరసనలు, అనుసరించాల్సిన వ్యూహాలు, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు ఈ విస్తృతస్థాయి సమావేశంలో ప్రస్తావనకు రానున్నాయి. పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలను స్వీకరించిన తరువాత పురంధేశ్వరి తొలిసారిగా జిల్లాకు రాబోతోన్న నేపథ్యంలో- నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

దీని తరువాత ఆమె గుంటూరులో పర్యటిస్తారు. కోస్తా జిల్లాల నేతలతో భేటీ కానున్నారు. ఈ సమావేశం ఈ నెల 25వ తేదీన ఏర్పాటు కానుంది. 26వ తేదీన రాజమండ్రిలో గోదావరి జిల్లాల నేతలతో సమీక్షా సమావేశాలను నిర్వహిస్తారు. 27వ తేదీన విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులను కలుసుకుంటారు.

### ‘ స్వీప్‘ కార్యక్రమాలతో ఓటర్ నమోదు పెరగాలి : కలెక్టర్

ప్రతి ఒక్కరు సులభంగా ఓటు నమోదు చేసుకోవచ్చని వివరించారు . స్వీప్ కార్యక్రమం ద్వారా అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయుటకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కొత్త ఓటర్లను నమోదు చేయుటకు, ఓటర్ కార్డులో మార్పులు చేర్పులు చేయుటకు అవకాశం ఉందని తెలిపారు. యువత ప్రధానంగా ఓటు హక్కు గొప్పతనాన్ని తెలుసుకుని, వినియోగించాలని ఆయన సూచించారు. ఫారం-6 నింపి క్రొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఫారం-8 నింపి ఓటర్ కార్డ్‌లో మార్పులు, సవరణలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 01-01-2024 నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన వారందరూ కూడా ఓటు పొందుటకు అర్హులని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ 2024 కొరకు ఇప్పటినుంచే ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ ఓటరు నమోదుకు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఓటు హక్కుకు అర్హత పొందిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు కావాలని, అదేవిధంగా ఇతరులను కూడా ప్రోత్సహించాలని తెలిపారు. ఓటరుగా నమోదు కావడమే కాకుండా ఎన్నికల్లో ఓటు కలిగిన ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ నమోదు శాతం చాలా తక్కువగా ఉందని కావున ప్రతి ఒక్కరూ, ప్రతి విద్యార్థి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని అన్నారు. ఓటింగ్ శాతం పెంచాలని అన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇతర జిల్లాల నుంచి చదువుకొనుటకు ఇక్కడికి వచ్చిన విద్యార్థులు కూడా తమ ఓటు హక్కును ఇక్కడ వినియోగించుకొనుటకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు నమోదు దరఖాస్తులు అందజేశారు.

భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజాస్వామ్యానికి గట్టి పునాది వేయాలని కోరారు. ఓటరు హెల్ప్ లైన్ యాప్ వినియోగంపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కుపై విద్యార్థిని, విద్యార్థులు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, ఎస్డీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఆనందకుమార్, బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి , విద్యారినీ విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఏయూ విద్యార్థులకు నేవల్ డాక్‌యార్డ్‌లో ఇంటర్న్‌షిప్‌లు

ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిలుస్తాయని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకమైన రక్షణ రంగ సంస్థలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం రావడం చాలా ప్రతిష్టాత్మకమన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుంటూ తమ జ్ఞానాన్ని పెంపొందించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని ఏయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు సైతం వర్తింప చేయడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో విభాగాధిపతులు, అనుబంధ కళాశాలలు అనిట్స్, డాక్టర్ ఎల్.బుల్లయ్య కళాశాల, గాయత్రీ విద్యాపరిషత్, వెల్ఫేర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏయూ మహిళా ఇంజినిరంగ్ కళాశాల, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నూతన అధ్యక్షురాలి స్వాగతానికి నగర బీజేపీ ఏర్పాట్లు

గంగయ్య, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్ రెడ్డి, బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్. విజయానంద రెడ్డి,బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.ప్రేమ కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాలిమేర శ్రీనివాస రావు, ఎస్‌వీఎస్ దిలీప్ వర్మ, శ్రీరంగం ధనేశ్వరరావు, జిల్లా పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### అప్పన్నను దర్శించుకున్న అవంతి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): సింహాచలంలోని శ్రీశ్రీశ్రీ వరహా లక్ష్మీ నృసింహ స్వామివారిని శనివారం భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు అవంతి శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ సాదర స్వాగతం పలికారు. ముందుగా కప్పస్తంభము ఆలింగనము, తదుపరి స్వామి వారి దర్శనము, అనంతరము వేద పండితులచే వేద ఆశీర్వచనము చేయించి శేష వస్త్రం ధరింపజేశారు. ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి స్వామివారి ప్రసాదాలను ముత్తంశెట్టి దంపతులకు అందజేశారు.

**పంచాంగం**

ఆదివారం 23-07-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
అధిక శ్రావణ మాసం

తిథి : శు. పంచమి ఉ. 07.07
నక్షత్రం : ఉత్తర సా. 04.53
వర్జ్యం : రా. 01.59 ల 03.41

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు స్మార్ట్ వర్క్, సమన్వయంతో పనిచేయాలి



కాకినాడ, (విశాఖ సమాచారమ్): వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ, స్మార్ట్ వర్క్‌తో పనిచేసి కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో సమస్యలను పరిష్కరించి వాటి ఫలాలను వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖల మంత్రి డా. సీదిరి అప్పలరాజు కోరారు. శనివారం కలెక్టరేట్ విధానగౌతమి సమావేశ మందిరంలో కాకినాడ అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఇన్‌ఛార్జ్ మంత్రి సీదిరి అప్పలరాజు అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ డా. కృతికా శుక్లా, కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డా. మహేష్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు హాజరైయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పల రాజు మాట్లాడుతూ గౌరవ ముఖ్య మంత్రి ఆదేశాలు, ఆకాంక్షల మేరకు లక్ష్యాలను పూర్తిచేసేందుకు వీలుగా ప్రతి వారం ఒక్కో నియోజకవర్గంపై సమీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఎప్పుడూ ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో 33.50 లక్షలు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ జరిగిందన్నారు. ఒక్క కాకినాడ అర్బన్ నియోజకవర్గం పరిధిలోనే 30 వేల పట్టాలు అందించినట్లు వివరించారు. సెంటు జాగా కూడా దొరకడం కష్టమైన ఈ ప్రాంతంలో 650 ఎకరాలను సేకరించి మరీ లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద నియోజక వర్గానికి సంబంధించి కొమరగిరి, ఏపీ త్రయం లేఅవుట్లలో గ్రౌండ్ అయిన 16,621 ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాల న్నారు. ఏపీ టిడ్కోకు సంబంధించి మొత్తం 2,056 ఫ్లాట్లు మంజూరుకాగా తొలిదశలో 1,152 ఫ్లాట్లను ఆగస్టు చివరిలోగా లబ్ధిదారులకు అప్పగించి, గృహ ప్రవేశాలు జరిగేలా మిగిలియున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. రూ. 978 కోట్లతో స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టిన 71 ప్రాజెక్టుల్లో 52 ఇప్పటికే పూర్తయినందున మిగిలిన వాటి పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కళాక్షేత్రం, సైన్స్ సెంటర్, స్కేటింగ్ రింక్ తదితరాలకు సంబంధించి చివరిదశలో ఉన్న పనులను మిషన్ మోడ్‌లో పూర్తిచేయాలన్నారు. జీవితం గురించి నేర్పిన గొప్ప ఊరు కాకినాడ అని ఈ జిల్లాకు ఇన్‌ఛార్జ్ మంత్రి కావడం తన అదృష్టమని మంత్రి అప్పలరాజు పేర్కొన్నారు.

సమావేశం సందర్భంగా నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు, స్మార్ట్ సిటీ మిషన్, ప్రజారోగ్యం, పారిశుధ్యం, ఏటీ టిడ్కో, ట్రాఫిక్, జీజీహెచ్‌లో అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చ జరిగింది. కాకినాడ జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్, మాతా శిశు సంరక్షణ యూనిట్ పనులపై కాకినాడ ఎంపీ వంగా గీత సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పనుల ఆవశ్యకతను వివరించి పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాల న్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కాకినాడలో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి అందుబాటు లోకి రానుందని ఎంపీ వంగా గీత వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమంలో నియోజకవర్గాన్ని ముందుంచేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఎంపీ వివిధ సూచనలు చేశారు.

కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అర్బన్ పరిధిలో లోవోల్టేజ్ సమస్య, కొండయ్యపాలెం ఆర్‌వోబీ, ఇంటిగ్రేటెడ్ కమాండ్, కంట్రోల్ సెంటర్ (సీసీసీ), ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, వెండింగ్ జోన్లు, విద్యుత్ స్తంభాల రీప్లేస్‌మెంట్ తదితర అంశాలను సమావేశంలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజారోగ్యంతో ముడిపడిన పారిశుద్ధ్యానికి సంబంధించి 380 మైక్రో పాకెట్స్ పరిధిలో అమలుచేయాల్సిన సమగ్ర పారిశుద్ధ్య కార్యక్రమాల భవిష్యత్ కార్యాచరణపైనా చర్చించారు.

## 70వేల మందికి జాతీయ రోజ్‌గార్ మేళా నియామకా పత్రాలు అందించిన ప్రధానమంత్రి

హైదరాబాద్, (ద.మ.రైల్వే): రెవెన్యూ, ఫైనాన్షియల్ సర్వీసెస్, తపాలా శాఖ, పాఠశాల విద్య, ఉన్నత విద్య, రక్షణ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, జలవనరులు, పర్సనల్ అండ్ ట్రైనింగ్, హోం మంత్రిత్వ శాఖ సహా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో వివిధ ఉద్యోగాలకు దేశమంతటి నుంచి వీరు ఎంపికయ్యారు.

ప్రధాని ప్రసంగం సందర్భంగా దేశవ్యాప్తంగా 44 ప్రాంతాలు మేళాతో అనుసంధానమయ్యాయి.

ప్రధాన మంత్రి మేళానుద్దేశించి ప్రసంగిస్తూ, కొత్తగా ఉద్యోగాలలో చేరబోతున్న యువతకు మాత్రమే నేడు చిరస్మరణీయ రోజు కాదని, 1947లో తొలిసారిగా ప్రస్తుత రూపం లో తిరంగాను రాజ్యాంగ సభ ఆమోదించిన రోజు కావడంతో ఇది దేశానికి కూడా చారిత్రాత్మకమైన రోజు అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ ముఖ్యమైన రోజున కొత్తగా నియమితులైన వారికి ప్రభుత్వ సర్వీసులకు అపాయింట్ మెంట్ లెటర్ అందుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమని, వారంతా దేశం పేరును ముందుకు తీసుకెళ్లాలని ప్రధానమంత్రి పిలుపు ఇచ్చారు. భారతదేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న సమయంలో వికసిత భారత్ లక్ష్యానికి దోహదపడే అవకాశం కొత్తగా నియమితులైన వారికి వారి శ్రమ, అంకితభావం ఫలితంగానే లభించిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రిక్రూట్ అయిన వారికి, చేసుకున్న వారికి, వారి కుటుంబ సభ్యులకు ప్రధాన మంత్రి అభినందనలు తెలిపారు.

ఆజాదీ కా అమృత్ కాల్ లో భారతదేశాన్ని ' వికసిత్ భారత్'గా మార్చాలని ప్రతి పౌరుడు సంకల్పం తీసుకున్నారని ప్రధాని అన్నారు. రాబోయే 25 సంవత్సరాలు కొత్త ఉద్యోగులకు, దేశానికి చాలా కీలకమని ఆయన నొక్కిచెప్పారు, ఎందుకంటే ఇటీవలి సంవత్సరాలలో ప్రపంచ దేశాలకు భారతదేశం పట్ల పెరిగిన విశ్వాసం, ప్రాముఖ్యత, ఆకర్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రపంచంలో 10వ స్థానం నుంచి 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. చాలా మంది ఆర్థిక నిపుణులు చెబుతున్నట్లుగా భారత్ ప్రపంచంలోని టాప్ త్రీ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారబోతోందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రపంచంలో టాప్ త్రీ ఆర్థిక వ్యవస్థ గా ఎదగడం భారత్ కు ఒక గొప్ప విజయం అవుతుందని ప్రధాన మంత్రి అన్నారు. ఇది అన్ని రంగాల్లోనూ ఉపాధి




అవకాశాలను పెంచుతుందని, సామాన్య ప్రజల ఆదాయాన్ని కూడా పెంచుతుందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. అమృత్ కాల్ లో దేశానికి సేవ చేసే సువర్ణావకాశం కొత్త అధికారులకు లభించిందని, ప్రభుత్వ రిక్రూట్ పొందడానికి ఇంతకంటే మంచి సమయం మరొకటి ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. దేశ ప్రజలకు సేవ చేయడం, వారి సమస్యలను పరిష్కరించి జీవన సౌలభ్యాన్ని పెంపొందించడం, వికసిత భారత్ లక్ష్యాలకు అనుగుణంగా తమను తాము అనుసంధానం చేసుకోవడం వారి ప్రాధాన్యాంశాలుగా ఉండాలని ఆయన సూచించారు. "మీ నుండి ఒక చిన్న ప్రయత్నం మరొకరి జీవితంలో ఒక పెద్ద మార్పును సృష్టించగలదు", అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు, ఎందుకంటే ప్రజలు దేవుని రూపమని, వారికి సేవ చేయడం దేవుని సేవతో సమానమని అన్నారు. నూతన ఉద్యోగులు ఇతరులకు సేవ చేయాలనే నమ్మకంతో పనిచేయాలని, తద్వారా గొప్ప సంతృప్తిని పొందాలని ఆయన ఉద్ఘాటించారు.

నేటి కార్యక్రమంలో నియామక పత్రాలు అందుకున్నవారిలో ఎక్కువ మంది ఉన్న బ్యాంకింగ్ రంగం గురించి ప్రస్తావిస్తూ, ఆర్థిక వ్యవస్థ విస్తరణలో బ్యాంకింగ్ రంగం పాత్రను ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. "నేడు, బ్యాంకింగ్ రంగం బలంగా ఉన్నట్టు పరిగణించబడుతున్న దేశాలలో భారతదేశం ఒకటి" అని శ్రీ మోదీ గత తొమ్మిదేళ్ల ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో రాజకీయ స్వార్థం ఈ రంగంపై చూపిన దుష్ప్రభావాన్ని వివరించారు. గతంలో శక్తివంతుల ఫోన్ కాల్స్ ద్వారా రుణాలు మంజూరు చేసిన 'ఫోన్ బ్యాంకింగ్'ను ఆయన ప్రస్తావించారు. ఈ రుణాలు తిరిగి చెల్లించ బడలేదని తెలిపారు. ఈ కుంభకోణాలు దేశంలోని బ్యాంకింగ్ రంగం వెన్నుముకను విరిచాయని ఆయన అన్నారు. 2014 తర్వాత పరిస్థితిని చక్కదిద్దేందుకు తీసుకున్న చర్యలను వివరించారు.

ప్రభుత్వ బ్యాంకుల నిర్వహణను బలోపేతం చేయడం, ప్రొఫెషనలిజానికి ప్రాధాన్యం ఇవ్వడం, చిన్న బ్యాంకులను పెద్ద బ్యాంకులతో విలీనం చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు. ఐదు లక్షల వరకు డిపాజిట్లకు ఇన్సూరెన్స్ చేయడం ద్వారా 99 శాతానికి పైగా డిపాజిట్లు సురక్షితంగా మారాయని, ఇది బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకాన్ని పునరుద్ధరించిందని శ్రీ మోదీ అన్నారు. దివాలా కోడ్ వంటి చర్యల ద్వారా బ్యాంకులను నష్టాల నుంచి కాపాడినట్టు చెప్పారు. అంతేకాకుండా, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టిన వారి ఆస్తులను జప్తు చేయడం ద్వారా వారిపై పట్టు బిగించినట్టు పేర్కొన్నారు. గతం లో నష్టాలకు, ఎన్ పి ఎ లకు పేరొందిన బ్యాంకులు ఇప్పుడు తమ రికార్డు లాభాల పై చర్చించుకుంటున్నాయని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలోని ఉద్యోగుల కృషి గర్వకారణమని ప్రధాని అన్నారు. బ్యాంకింగ్ రంగంలో పని చేస్తున్నవారు తనను, తన దార్శనికతను ఎన్నడూ నిరాశపరచలేదని అన్నారు. 50 కోట్ల జన్ ధన్ ఖాతాలను తెరవడం ద్వారా జన్ ధన్ ఖాతా పథకాన్ని విజయవంతం చేయడంలో బ్యాంకింగ్ రంగం చేస్తున్న కృషిని ప్రధాన మంత్రి ప్రశంసించారు. మహమ్మారి సమయంలో కోట్లాది మంది మహిళల ఖాతాల్లోకి డబ్బు బదిలీ చేయడంలో ఇది చాలా సహాయ పడిందని అన్నారు.

ఎమ్ ఎస్ ఎమ్ ఇ రంగం అభ్యున్నతికి చేస్తున్న ప్రయత్నాల గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఔత్సాహిక యువత కు పూచీకత్తు లేని రుణాలను అందించిన ముద్ర యోజన గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ పథకాన్ని విజయవంతం చేసిన బ్యాంకింగ్ రంగాన్ని ఆయన అభినందించారు. అదేవిధంగా ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణ మొత్తాన్ని రెట్టింపు చేసిన సందర్భం లోనూ, చిన్న పరిశ్రమలకు రక్షణ కల్పిస్తూ 1.5 కోట్ల ఉద్యోగాలను కాపాడేందుకు ఎంఎస్ఎంఇ రంగానికి రుణాలు అందించిన సందర్భం లోనూ బ్యాంకింగ్ రంగం ఎంతో సహకారం అందించిందని ఆయన అన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని విజయవంతం చేసినందుకు కూడా బ్యాంకు ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్వనిధి పథకం కింద 50 లక్షల మందికి పైగా వీధి వ్యాపారులకు సహాయం చేశారు. "బ్యాంకింగ్ ను పేదల సాధికారత సాధనంగా మార్చడానికి మీరు 'నియామక పత్రం' తో పాటు సంకల్ప్ పత్ర (రిజల్యూషన్ లెటర్) కూడా 'తీసుకుంటారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను" అని ప్రధానమంత్రి అన్నారు.

గడచిన ఐదేళ్లలో 13 కోట్ల మంది భారతీయులను దారిద్ర్య రేఖకు ఎగువకు తీసుకువచ్చినట్లు ఇటీవలి నీతి అయోగ్ నివేదిక గుర్తించిందని ప్రధాని చెప్పారు. ఇందులో ప్రభుత్వోద్యోగుల కృషిని గుర్తించి పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు, విద్యుత్ కనెక్షన్ల పథకాలను ప్రస్తావించారు. "ఈ పథకాలు పేదలకు చేరడంతో వారిలో మనోధైర్యం కూడా పెరిగింది. భారతదేశం నుండి పేదరికాన్ని నిర్మూలించడానికి మనమందరం కలిసి ప్రయత్నాలను పెంచితే, భారతదేశం నుండి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చనే వాస్తవానికి ఈ విజయం చిహ్నం. ఖచ్చితంగా, దేశంలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఇందులో పెద్ద పాత్ర ఉంది" అని ప్రధాన మంత్రి తన పేర్కొన్నారు.

దేశంలో పేదరికం తగ్గుముఖం పట్టిన మరో కోణాన్ని ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఇది కొత్త మధ్యతరగతి విస్తరణ, ఇది కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తోంది. పెరుగుతున్న డిమాండ్, కొత్త మధ్యతరగతి ఆకాంక్షలు తయారీ రంగాన్ని నడిపిస్తున్నాయి. భారత కర్మాగారాలు, పరిశ్రమల్లో ఉత్పత్తిని పెంచడం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందేది దేశ యువతేనని ఆయన పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ ఎగుమతులు, 2023 మొదటి ఆరు నెలల్లో విక్రయించిన కార్ల సంఖ్య, ఎలక్ట్రిక్ వాహనాల రికార్డు అమ్మకాలు ఇలా భారతదేశం ప్రతిరోజూ కొత్త రికార్డులను సృష్టిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కార్యకలాపాలన్నీ దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచుతున్నాయని అన్నారు.

"యావత్ ప్రపంచం భారతదేశ ప్రతిభపై ఒక కన్నేసి ఉంచుతోంది" అని ప్రధాన మంత్రి అన్నారు, ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో అధిక సగటు వయస్సు కారణంగా శ్రామిక జనాభా క్షీణిస్తున్న సమస్యను ఆయన ప్రస్తావించారు. అందువల్ల ఇది భారతదేశ యువత కష్టపడి తమ నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన సమయమని ప్రధాన మంత్రి అన్నారు. భారత దేశంలో ఐటీ నిపుణులు , డాక్టర్లు, నర్సులకు ఉన్న గొప్ప డిమాండ్ ను ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, భారత టాలెంట్ కు ఉన్న గౌరవం ప్రతి దేశంలోనూ, ప్రతి రంగంలోనూ నిరంతరం పెరుగుతోందని అన్నారు. గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించిందని, పీఎం కౌశల్ వికాస్ యోజన కింద 1.5 కోట్ల మంది యువతకు శిక్షణ ఇచ్చామని ప్రధాని వివరించారు. 30 స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా యువతను అంతర్జాతీయ అవకాశాలకు సిద్ధం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా కొత్త మెడికల్ కాలేజీలు, ఐటీఐలు, ఐఐటీలు, టెక్నికల్ ఇన్ స్టిట్యూట్ ల నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ, 2014 వరకు మన దేశంలో కేవలం 380 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయని, గత తొమ్మిదేళ్లలో ఈ సంఖ్య 700కు పైగా పెరిగిందని తెలిపారు. నర్సింగ్ కాలేజీల సంఖ్య గణనీయంగా పెరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. "ప్రపంచ డిమాండ్ ను తీర్చే నైపుణ్యాలు భారతదేశ యువతకు లక్షలాది కొత్త అవకాశాలను సృష్టించబోతున్నాయి" అని మోదీ అన్నారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తూ, ఉద్యోగాలకు నియమితులైన వారందరూ చాలా సానుకూల వాతావరణంలో ప్రభుత్వ సర్వీసులో చేరుతున్నారని, ఈ సానుకూల ఆలోచనను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఇప్పుడు వారి భుజస్కంధాలపై ఉందని అన్నారు. అభ్యసన, స్వీయ అభివృద్ధి ప్రక్రియను కొనసాగించాలని, ప్రభుత్వం రూపొందించిన ఆన్ లైన్ లెర్నింగ్ ప్లాట్ ఫామ్ ఐ జి ఒ టి కర్మయోగిని సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన మంత్రి కోరారు.

ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రధాని నిబద్ధతను నెరవేర్చే దిశగా రోజ్ గార్ మేళా ఒక ముందడుగు. ఉపాధి కల్పనను పెంపొందించడంలో, జాతీయాభివృద్ధిలో యువత సాధికారత, భాగస్వామ్యం కోసం అర్థవంతమైన అవకాశాలను కల్పించడంలో రోజ్ గార్ మేళా ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని భావిస్తున్నారు.

కొత్తగా నియమితులైన వారికి ఐ జి ఒ టి కర్మయోగి పోర్టల్ లోని ఆన్ లైన్ మాడ్యూల్ కర్మ యోగి ప్రారంభ్ ద్వారా శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది, ఇక్కడ 400కు పైగా ఇ-లెర్నింగ్ కోర్సులను 'ఎక్కడైనా ఏదైనా పరికరం' లెర్నింగ్ ఫార్మాట్ కోసం అందుబాటులో ఉంచారు.

# విశాఖ సమాచారమ్

ఆదివారం 23-07-2023


## సంస్కృతి

ఒక సమాజ జీవనంలో మిళితమైన కళలు, నమ్మకాలు, సంస్థలు, తరాలలో జరిగే మార్పులు, తరాల మధ్య వారసత్వంగా కొనసాగే విధానాలు అన్నీ కలిపి సంస్కృతి అంటారు.

తెలుగు సమాజంలో సభ్యులుగా మానవులు అలవర్చుకున్న జ్ఞానమూ, నమ్మకాలూ, కళలూ, నీతులూ, చట్టాలూ, అచారాలూ, అలవాట్లూ ఇంకా ఏయే విషయాలనైతే మానవులు అలవర్చుకుంటారో,ఆ విషయాలన్నింటినీ కలుపుకుని ఆ మొత్తాన్ని" తెలుగు సంస్కృతి" అనవచ్చు. ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవనవిధానమే ఆ సమాజపు సంస్కృతి. ఆ సమాజంలో పాటించే ఆచారాలు,పద్ధతులు, అభివాదాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు - అన్నీ కలిపి సంస్కృతి అవుతాయి.

ఒక సమాజంలో ఉన్న వస్తు వినియోగం, సంపన్నత, జానపద వ్యవహారాలు కూడా సంస్కృతిగా భావింప బడతాయి. ఒక సమాజం చేసిన, వాడిన పరికరాలు, నిర్మించిన కట్టడాలు, వారి సంగీతం, శిల్పం, చిత్రం, నృత్యం, నాట్యంవంటి కళలు, జీవన విధానం, ఆహారం వంటి వస్తువులతోపాటు పెనవేసుకొని పోయిన సంబంధాలు, ఆచారాలు, కళలు, విజ్ఞానం, నైతికత కూడా సంస్కృతిలో భాగమే అని మానవ శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

**కళలు** : తెలుగుప్రజలు తమ జీవన విధానంలో వినోదానికెప్పుడూ పెద్దపీటనే వేసారు. ఇక్కడ కళాకారులను, కళలనూ గుర్తించి గౌరవించి పోషించటం వల్ల కళలు చాలాకాలం అజరామరంగా జీవించాయి.

**జానపద కళలు** : జానపద కళలు కొమ్మునృత్యం, తప్పెటగుళ్ళు, డప్పు, జముకు, శరభనృత్యం, ఉరుములనృత్యం, బొమ్మల కొలువు, ప్రభలు, తెప్పోత్సవాలు మొదలైనవి.

**కథాకాలక్షేపాలు** : బుర్ర కథ, బుడిగె జంగాలు, హరికథ మొదలైనవి.

**గిరిజననృత్యాలు** : తెలుగునాట కూడా గిరిజనులకు ప్రత్యేకమైన పలు ఆచారాలు ప్రబలంగా ఉన్నాయి. వాటిలో తండాలనృత్యం, గుసాడీ, థింసా మొదలైనవి.

**రంగస్థల ప్రదర్శనలు : యక్షగానం, నాటకం**

**గ్రామవాసుల పందాలు** : ఎడ్లపందాలు, కోడి పందాలు సంచార ప్రదర్శనలు : పగటివేషం, జంగందేవరలు, బుడబుక్కలవారు, కాటికాపర్లు, పులివేషం, పకీరు వేషం, గంగిరెద్దులు మొదలైనవి.

**ఆటపాటలు** : చోడిగాడికలాపం, కోలాటం, బూచి, దాగుడుమూతలు, అచ్చనగన్నాలాట, తొక్కుడుబిళ్ళ, గుజ్జనగూళ్ళు వంటి ఆటలతో మైమరిచి పోతారు.

**గిరిజన ఉత్సవాలు** : బతుకమ్మ, నాగోబా జాతర, సమ్మక్కసారక్క జాతర

**పండుగలు** : ఉగాది, సంక్రాంతి, గంగజాతర, నాగులచవితి, అట్లతద్ది, బోనాలు, వినాయకచవితి, మొహరం పండుగ మొదలైనవి.

**కన్నెపిల్లల ఆటపాటలు** : తొక్కుడుబిళ్ళలు, చెమ్మచెక్క ,గవ్వలాట, గుజ్జనగూళ్ళు, గచ్చనగాయలు, ఉయ్యాల, గొబ్బిపాటలు, బొంగరాలు,గిల్లాకర్ర, చెడుగుడు, వీరకంబం ,కోక్కో, లాలిపాటలు

**నోములు, వ్రతాలు** : సత్యనారాయణ వ్రతం, కార్తీక నోములు

**సాహిత్యం :**

తెలుగుసాహిత్యంపైసంస్కృతసాహిత్యం,హైందవగ్రంథాల ప్రభావంఅధికంగాఉంది. కవిత్రయంగా పేరుగాంచిన నన్నయ తిక్కన మరియు ఎఱ్ఱాప్రగడలు మహాభారతాన్ని తెలుగులోకిఅనువదించారు. వేదవ్యాసుడురచించిన మహాభాగవతాన్ని బమ్మెర పోతన శ్రీమదాంధ్ర భాగవతంగా అనువదించాడు.

ఆదికవి నన్నయ పురాతనమైన తెలుగు-కన్నడ లిపినుండి ప్రస్తుత తెలుగులిపిని కూర్చారు. శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదను రచించటమే కాక దేశభాషలందు తెలుగులెస్స అని అన్నాడు. యోగివేమన తన పద్యాలద్వారా తాత్త్విక చింతనని వినిపించగా,విశ్వనాథ సత్యనారాయణ, సింగిరెడ్డి నారాయణరెడ్డి వంటి ఆధునిక కవులు తెలుగు భాషకి కొత్త సొబగులు అద్దారు. శ్రీశ్రీ, గద్దర్ లాంటి విప్లవ కవులు తమ భావాలని భాష ద్వారా వ్యక్తపరచి జనంలోకి చొచ్చుకుపోయారు. తెలుగు సాహిత్యానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. తెలుగు సాహిత్యం ఎంతో సుసంపన్నమైనది. ఆధ్యాత్మికంలోనైనా, శృంగారాది నవరసాలలోనైనా, జాతిని జాగృతం చేసే విషయంలోనైనా, తెలుగువారందరూ గర్వపడేటంత విశేషమై తెలుగు సాహిత్యం వెలుగొందుతున్నది. నన్నయ రాసిన భారతం తెలుగులో మొదటి కావ్యం. దానికిముందే జానపదగీతాలు, కొన్ని పద్యాలు ఉన్నట్లు ఆధారాలున్నాయి. గాథాసప్తశతిలో తెలుగు జానపదగీతాల ప్రస్తావన ఉంది.

**ఆహారపుటలవాట్లు** : భారతదేశంలోకెల్లా అత్యధిక మసాలా దినుసులు వాడే వంటకాలుగా తెలుగు వంటకాలు ప్రశస్తి. ప్రదేశానుసారం,సంప్రదాయానుసారం తెలుగు వంటకాలలో వివిధరకాలు గలవు. పచ్చళ్ళు, ఊరగాయలు మొదలుకొని అల్పాహారాలు, పరిపూర్ణ భోజనంవరకు వివిధ వంటకాలు కలవు. అన్నం తెలుగువారి వంటకాలలో ప్రధానాంశం. ప్రతిరోజు చేసే భోజనంలో అన్నాన్ని నెయ్యితోపాటు వివిధ రకాల పొడులు, పచ్చళ్ళు, పప్పుతో భుజిస్తారు.

**ఆంధ్రుల దుస్తులు** : పురుషుల పంచెకట్టు ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉంటుంది. కోస్తాంధ్రలో పంచెని ధోవతివలె కట్టటం ఎక్కువగా కనిపిస్తుంది. రాయలసీమలో తమిళులవలె నడుముచుట్టూ కట్టే పంచెకట్టుని ఎక్కువగా వినియోగిస్తారు. వ్యవసాయం/సైకిలు త్రొక్కటం వంటి పనులు చేసే సమయంలో కట్టే ధోవతులు/పంచెకట్టులు, తలపాగా కట్టు, ఇతర సమయాలలో కట్టే కట్లతో భేదాలు ఉన్నాయి.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

రైల్ కోచ్ రెస్టారెంట్ కొరకు ఇ-వేలం

(1) వేలం క్యాటలాగ్ నెం. WAT-MISC-CR-013

లాటు నెం./క్యాటగిరి: MSS-WAT-VSKP-RCR-25-23-1 (Misc-Static-Services-Rail Coach Restaurant)

వివరణ: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ నందు డాల్ఫిన్స్ నోస్ రైల్ కాలనీ (LIC బిల్డింగ్ దగ్గర) యొక్క నార్త్ వెస్ట్ కార్నర్, అంబేద్కర్ సర్కిల్, విశాఖపట్నం వద్ద రైల్ కోచ్ రెస్టారెంట్ స్థాపించుట, నడుపుట మరియు యాజమాన్యం చేయుట అయిదు సంవత్సరాల కాలం నిర్వర్తించుట.

(2) వేలం క్యాటలాగ్ నెం. WAT-MISC-CR-014

లాటు నెం./క్యాటగిరి: MSS-WAT-VSKP-RCR-24-23-1 (Misc-Static-Services-Rail Coach Restaurant)

వివరణ: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్‌లోని విశాఖపట్నం వద్దనున్న సాగర్ వ్యూ రైల్ కాలని (నోవా రెస్ట్ హౌస్ దగ్గర) ఈస్ట్ పాయింట్ రెస్ట్ హౌస్ వద్ద రైల్ కోచ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయుట, నడుపుట మరియు యాజమాన్యం చేయుట అయిదు సంవత్సరాల కాలం నిర్వర్తించుట.

లాటు ప్రారంభ తేదీ & సమయం: (వ.నెం. 1 కొరకు) 04.08.2023న 1100 గంటలు & (వ.నెం. 2 కొరకు) 07.08.2023న 1100 గంటలు, లాటు ముగింపు తేదీ & సమయం: (వ.నెం. 1 కొరకు) 04.08.2023న 1130 గంటలు & (వ.నెం. 2 కొరకు) 07.08.2023న 1130 గంటలకు

కనీస పెంపుదల: 0.2%, లాటు స్టేటస్: డ్రాఫ్ట్ క్యాటలాగ్ నందు కొత్తవి.

పూర్తి వివరములు లభించు వెబ్‌సైట్: http://www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్/ వాల్తేరు

PR-368/O/23-24


## ఆర్కే భార్య శిరీష, దుడ్డు ప్రభాకర్ అరెస్టు: ఎన్ఐఏ


ఆర్కే భార్య శిరీష

**ఒంగోలు:** మావోయిస్టు అగ్రనేత ఆర్కే భార్య శిరీషను ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడులో నిన్న జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. శిరీషను అరెస్టు చేసినట్టు ఎన్ఏఏ శనివారం ప్రకటన విడుదల చేసింది. ఆర్కే డైరీ ఆధారంగా శిరీషతో పాటు దుడ్డు ప్రభాకర్‌ను కూడా అరెస్టు చేశామని తెలిపింది.

దుడ్డు ప్రభాకర్, శిరీష మావోయిస్టుల కోసం పనిచేస్తున్నారని పేర్కొంది. మావోయిస్టుల నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకున్నట్టు గుర్తించామని ఎన్ఐఏ తెలిపింది. 2019లో జరిగిన తిరియా ఎన్‌కౌంటర్లో వీరిద్దరూ పాల్గొన్నారని, మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా భారీ కుట్రకు ప్రణాళిక సిద్ధం చేశారని ఎన్ఏఏ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

"జులై 28న సమావేశం ఏర్పాటు చేసుకొని భారీ కుట్ర పన్నేందుకు మావోయిస్టు కేడర్ ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. వీరు రాసిన లేఖలు, సాహిత్య పుస్తకాలతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాం" అని ఎన్ఐఏ వివరించింది.

## వరద ఉద్ధృతిలో చిక్కుకున్న ప్రయాణికుల బస్సు




బిజ్నోర్: భారీ వర్షాలతో ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. నదులు ఉప్పొంగి వరదలు రావడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఉత్తరప్రదేశ్‌లోని కొత్వాలీ నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో యూపీ-ఉత్తరాఖండ్ సరిహద్దుల్లోని ఓ రోడ్డుపైకి భారీగా వరదనీరు వచ్చింది. దీంతో ఆ మార్గంలో వెళ్తున్న ఓ ప్రయాణికుల బస్సు వరదల్లో చిక్కుకుపోయింది.

యూపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు రూపెదిహా నుంచి హరిద్వార్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

ఘటన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులున్నారు. వరద ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో బస్సు ముందుకెళ్లలేకపోయింది. తమను కాపాడాలంటూ ప్రయాణికులు హహకారాలు చేశారు. బస్సును గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు.

అక్కడకు చేరుకున్న పోలీసులు జేసీబీ మిషన్ల సాయంతో ప్రయాణికులను రక్షించారు. ఆ తర్వాత బస్సును కూడా వరద నుంచి బయటకు తీసుకొచ్చారు. ప్రయాణికులందరూ సురక్షితంగానే ఉన్నారని పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## బ్యాంకులూ వారానికి 5 రోజులే

హైదరాబాద్: త్వరలో బ్యాంకులు కూడా వారానికి 5 రోజులే పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు భారత ప్రభుత్వానికి ఇండియన్ బ్యాంకింగ్ అసోసియేషన్ (ఐబీఏ) ప్రతిపాదనలు పంపినట్లు వార్తాసంస్థ సీఎన్‌బీసీ వెల్లడించింది. దీనికి బదులుగా రోజు 40 నిమిషాలు అదనంగా బ్యాంకు ఉద్యోగులు పనిచేయాలని ప్రతిపాదించారు. ఈ విషయంపై నిర్ణయం తీసుకునేందుకు జులై 28న యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్స్ యూనియన్స్ (యూఎఫ్‌బీఏ)తో ఐబీఏ సమావేశం కానుంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) పనిదినాలను వారానికి 5 రోజులుగా మారుస్తూ, ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. బ్యాంకులకూ ఇదే విధానాన్ని అమలు చేయాలని ఈనెల 19న నిర్వహించిన సమావేశంలో యూబీఎఫ్ఏ కోరింది. దీంతో పాటు బ్యాంకు ఉద్యోగుల వేతనాల పెంపు, పదవీ విరమణ చేసిన వారికి ఆరోగ్య బీమా పాలసీ తదితర అంశాలపైనా చర్చించి, ఐబీఏ దృష్టికి తీసుకెళ్లింది.

వీటిపై వచ్చేవారం ఇరు వర్గాలూ చర్చించబోతున్నాయి. ఇందులో ప్రధానంగా బ్యాంకు పనిదినాలపైనే దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. బ్యాంకుల పనిదినాలను వారానికి 5 రోజులు చేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రి వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే ఐబీఏ కూడా తన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. వారంలో ఒకరోజు పని తగ్గుతున్నందున, దీనికి బదులుగా 5 రోజుల పాటు, సిబ్బంది పనివేళలను రోజూ మరో 40 నిమిషాల పాటు పెంచాలని ఐబీఏ భావిస్తోంది. వారానికి అయిదు రోజులు పనిదినాలను అమలు చేయాలని ఎప్పటి నుంచో బ్యాంకింగ్ యూనియన్లు ఒత్తిడి చేస్తున్నాయి. ఎల్ఐసీకి అమలు చేయడంతో ఇది మరోసారి తెరపైకి వచ్చింది.

ఆరోగ్య బీమా పాలసీలకు సంబంధించి, పదవీ విరమణ చేసిన వారికి రూ.2లక్షల వరకు ప్రాథమిక ఆరోగ్య బీమా పాలసీకి యూబీఎఫ్‌యూ అంగీకరించింది. దీనికి అదనంగా టాపప్ పాలసీని రూ.10లక్షల వరకు తీసుకునేందుకు ఆప్షనల్ విధానంలో అనుమతించాలని కోరుతోంది.

## మణిపూర్ మహిళలపై హింసను ఆపాలి




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** మణిపూర్ లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నాడు నిరసన ప్రదర్శన జరిగింది. ప్రదర్శన సుందరయ్య భవన్ నుండి ప్రారంభమై ఇంద్రపాలెం వంతెన, జిల్లా కలెక్టర్ కార్యాలయం మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయం వరకు జరిగింది.

సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిపిఎం జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ మణిపూర్‌లో

జరుగుతున్న హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. మణిపూర్ లో మైతే, కుకి తెగలమధ్య మొదలైన హింసకాండవల్ల 150 మంది హత్య చేయబడ్డారని, ప్రతీ రోజు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని, అనేకమంది కుకి తెగకు సంబంధించిన గిరిజనుల గృహాలను తగలబెట్టారని, ఇంత విధ్వంసం జరుగుతున్నా ప్రధాని మోడీ స్పందించకపోవడం చూస్తే మణిపూర్లో జరుగుతున్న హింసకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండదండలతో జరుగుతుందని విమర్శించారు.

తక్షణం మణిపూర్ లో శాంతిని నెలకొల్పాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాలపై మైత్రి తెగ ప్రజలకు హక్కుని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం నేడు మత కలహాలుగా మారి చర్చిలు తగలబెడుతూ, క్రిస్టియన్ పాస్టర్లను చంపుతున్నారని, ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం బీజేపీ హిందుత్వ ఎజెండాలో భాగంగానే జరుగుతుందన్నారు. గిరిజనుల భూములను మైత్రి ప్రజలకు ఇవ్వాలనే సాకుతో విలువైన ఖనిజాలు కలిగిన కొండ ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే కుట్ర దాగిఉందని, కాబట్టే కేంద్ర ప్రభుత్వం హింసాకాండను అరికట్టేందుకు ఏ ప్రయత్నమూ చేయడంలేదని విమర్శించారు.

తక్షణం అల్లర్లకు పాల్పడే అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకుని మణిపూర్ లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కె.ఎస్. శ్రీ నివాస్, కరణం ప్రసాదరావు, నీలపాల సూరిబాబు, పలివెల వీరబాబు, టి.ఈశ్వరరావు, కె.జ్యోతి, కె.సత్తిరాజు, సిహెచ్. రాజ్ కుమార్, కె.నాగేశ్వరరావు, వి.రాజబాబు, కె.వీరబాబు, ఈశ్వరి, మణి, పద్మ, ఎం.వి.రమణ, ఆర్. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వెదురు కొమ్ములుతో వంటకం బలే రుచులు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు గిరిజన ప్రాంత అడవులలో ప్రకృతి సిద్ధమైన ఆహారం వెదురు కొమ్ములు దొరుకుతుంది ఈ సీజన్లో వెదురు కొమ్మలు ప్రత్యేకత ఏంటి అంటే దీనిలో అనేక రకమైన పోషక పదార్థాలు ఉంటాయి మా పూర్వీకులు పెద్దలు అందరు కూడా కొన్ని సంవత్సరాల కిందట ఇటువంటి తిని బ్రతికారు అప్పట్లో వరి అన్నం ఇటువంటి లేదు అడవుల్లో దొరికే దుంపలు వెదురు కొమ్ములు తిని జీవనం గడిపేవారు ప్రస్తుతం పాడేరు, జి మాడుగుల, కించుమండ, పెదబయలు, ముంచింగ్ పుట్ వారపు సంతల్లో విరివిగా ఈ సీజన్ లో దొరుకుతాయి ,ఇవి బాగా చిన్నవిగా కోసుకుని ఉప్పు తో కడగాలి ఆతర్వాత వేడి నీటి లో ఉడికించాలి,తర్వాత పోపు వేసుకుని వేపుడు గా చేసుకుని తినవచ్చు మసాలా కుడా వేస్తే ఇంకా గుమగుమలు గా నోటికి రుచులు ఉరిస్తుంది అడవి లో వెదురు కొమ్ములు.

## పలు ప్రత్యేక రైళ్లు పొడిగింపు

హైదరాబాద్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను పొడిగించింది. వేసవి, పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చిన ఈ రైళ్లను అక్టోబర్ 1 వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో హైదరాబాద్- కటక్ తిరుపతి-జల్నాబీ జల్నా- చాప్రాబీ హైదరాబాద్- గోరక్‌పూర్ మధ్య నడిచే ప్రత్యేక రైళ్లు ఉన్నాయి. ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 1 తేదీల మధ్య నిర్దేశించిన తేదీల్లో ఆయా రైళ్లు నడుస్తాయి.

మరోవైపు ద.మ.రైల్వే పరిధిలోని 4 రైల్వేస్టేషన్లలో జనాహారం అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్, విజయవాడ గుంతకల్లు, రేణిగుంటలలో రైళ్ల సాధారణ బోగీలు ఆగేచోట ఈ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు జోన్ తెలిపింది. రూ.20కి ఎకానమీ భోజనం, రూ.50కి కాంబో భోజనం లభిస్తుందని ఓ ప్రకటనలో పేర్కొంది. సాధారణ ప్రయాణికులకు జనాహారం ఉపయోగకరంగా ఉంటుందని జోన్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. ఈ 4 స్టేషన్లలో ఇప్పటికే ఐఆర్‌సీటీసీ వంటశాలలు ఉండటంతో వాటిద్వారా జనాహారాన్ని ద.మ.రైల్వే అందిస్తున్నట్లు ఆయన వివరించారు.

## మంచినీళ్లనుకుని యాసిడ్ తాగిన మహిళ



**భోపాల్** : మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. బాటిల్స్‌ను శుభ్రం చేసే ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు మంచినీళ్లు అనుకుని యాసిడ్ తాగడంతో పరిస్థితి విషమంగా మారిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రింకూ ఠాక్రే అనే మహిళ బాటిల్స్‌ను శుభ్రం చేసే ఫ్యాక్టరీలో పనిచేస్తుంది. దాహం వేయడంతో తన పక్కనే ఉన్న మరో మహిళను మంచినీళ్లు అడిగింది. పనిలో ఉన్న ఆ మహిళ గమనించకుండా నీళ్ల సీసాను అందించింది. రింకూ కూడా మంచినీళ్లు అనుకోని పొరపాటున తాగింది. నోరు కాలడంతో వెంటనే ఉమ్మడానికి ప్రయత్నించిన యాసిడ్ లోపలకు వెళ్లడంతో ఆమె అస్వస్థతకు గురైంది. వెంటనే చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు' అని పోలీసులు తెలిపారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటిన కైలాష్ సత్యార్థి



పచ్చని ప్రపంచం కోసం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ నిర్విరామంగా కృషిచేస్తున్నారని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి పేర్కొన్నారు. ఇవాళ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఆయన రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్‌తో కలిసి గచ్చిబౌలి ఐఐటీ క్యాంపస్‌లో మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో ప్రకృతి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తీసుకువచ్చిన వృక్షవేదం, హరితహాసం పుస్తకాలను కైలాస్ సత్యార్థికి అందించి సత్కరించామని ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ తెలిపారు.

## త్వరలో చాట్‌జీపీటీ ఆండ్రాయిడ్ యాప్

చాట్‌జీపీటీ రాకతో కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్‌లను వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో ఆయా సంస్థలు ప్రత్యేకంగా యాప్‌లను రూపొందిస్తున్నాయి. ఇప్పటికే చాట్‌జీపీటీ తన యాప్‌ను మే నెలలోనే ఐఫోన్ యూజర్లకు పరిచయం చేయగా.. రానున్న వారంలో ఆండ్రాయిడ్ యూజర్లకు కూడా అందించనుంది. ఈ విషయాన్ని కంపెనీ తన అధికార ట్విటర్ ఖాతాలో పంచుకుంది.

ఆండ్రాయిడ్ యూజర్లు వచ్చే వారం నుంచే చాట్‌జీపీటీ యాప్‌ను వినియోగించుకోవచ్చని కంపెనీ తెలిపింది. అయితే ఏ రోజున తీసుకొస్తామన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఈ యాప్ ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్‌లో లిస్ట్ అయిందని వచ్చే వారం నుంచి అందుబాటులోకి రానుందంటూ కంపెనీ తెలిపింది. యాప్ రిలీజ్ అయిన వెంటనే చాట్‌జీపీటీ సేవలు పొందాలనుకొనే వారు మాత్రం ముందుగానే గూగుల్ ప్లే స్టోర్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపింది.

కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్‌లైన చాట్‌జీపీటీ, గూగుల్ బార్డ్ చాట్‌బాట్‌ల మధ్య పోటీ పెరిగింది. అయితే ఇప్పటివరకు గూగుల్ బార్డ్‌కు ప్రత్యేక మొబైల్ యాప్ లేదు. కానీ, మైక్రోసాఫ్ట్ మాత్రం ఫిబ్రవరిలోనే తన బింగ్ యాప్‌ను ఆండ్రాయిడ్, ఐఫోన్లల్లో అందుబాటులోకి తెచ్చింది. అయితే చాట్‌జీపీటీ ఆండ్రాయిడ్ రాకతో గూగుల్ బార్డ్ కొంత పోటీని ఎదుర్కోవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# మధుమేహం నియంత్రణకు అద్భుత ఔషధం తులసి నీళ్లే



ఆయుర్వేదంలో, హిందూ ఆధ్యాత్మికతలో తులసి మొక్కకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. తులసి మొక్క ఆకులు, గింజలతో అద్భుత ప్రయోజనాలున్నాయి. తులసి ఆకుల నీళ్లతో మధుమేహాన్ని సైతం నియంత్రించవచ్చని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రస్తుత బిజీ ప్రపంచంలో మధుమేహం అనేది పెనుసవాలు విసురుతున్న సమస్యగా మారుతోంది. మధుమేహం నియంత్రణలో ఉంటేనే ఆరోగ్యపరంగా బాగుంటుంది. ఎందుకంటే బ్లడ్ షుగర్ అనేది చాలా ప్రమాదకరం. బ్లడ్ షుగర్ స్థాయి పెరిగేకొద్దీ డయాబెటిక్ పేషెంట్‌గా మారిపోతారు. అయితే ఆయుర్వేదంలో మధుమేహానికి మంచి ప్రత్యామ్నాయం ఉందంటున్నారు వైద్యులు. సరైన ఆహారపు అలవాట్లు, మెరుగైన జీవనశైలితో చాలావరకూ రోగాల్ని దూరం చేసుకోవచ్చు. అయితే చిన్న చిన్న విషయాల్ని దృష్టిలో పెట్టుకుంటే..బ్లడ్ షుగర్ స్థాయిని నియంత్రించవచ్చు. అయితే తులసి నీళ్లతో బ్లడ్ షుగర్ తగ్గించుకోవచ్చని చాలా తక్కువ మందికి తెలుసు. తులసి ఆకుల నీళ్లను మధుమేహం తగ్గించేందుకు ఎలా వాడాలనేది ఇప్పుడు తెలుసుకుందాం.

మధుమేహం నియంత్రణలో ఉండాలంటే ముఖ్యంగా కావల్సింది బ్లడ్ షుగర్ లెవెల్స్ తగ్గించుకోవాలి. ఓ గ్లాసు నీళ్లలో తులసి ఆకులు కొన్ని వేసి ఉడికించాలి. ఆ తరువాత ఆ నీటిని వడపోసి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తాగాలి. ఇలా చేస్తే బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయంటున్నారు ఆయుర్వేద వైద్య నిపుణులు.

ఆయుర్వేద వైద్యశాస్త్రంలో తులసి నీళ్లతో చాలా ప్రయోజనాలున్నాయి. తులసి నీళ్లు జలుబు, దగ్గు తగ్గించేందుకు అద్భుతమైన ఔషధంగా ఉపయోపడతాయి. శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచేందుకు ఉపయోగపడుతుంది. ఆధునిక పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ఒత్తిడిని జయించేందుకు తులసి ఆకులు గానీ, తులసి నీళ్లు గానీ మీ డైట్‌లో భాగంగా చేసుకుంటే మంచి ఫలితాలుంటాయి. తులసి ఆకులతో టీ కూడా చేసుకుని తాగినా మంచి ఫలితాలుంటాయి.

# గ్యాస్ట్రిక్, బైపాస్ సర్జరీ తర్వాత ఎటువంటి ఆహారం తీసుకోవాలి

గ్యాస్ట్రిక్, బైపాస్ సర్జరీ తర్వాత సహజంగా ఎటువంటి డైట్ పాటించాలి. డీహైడ్రేషన్ కు గురి అవకుండా ఉండాలంటే ప్రతి రోజు రెండు లీటర్ల వరకూ ఫ్లూయిడ్స్ తీసుకోవాలి. ఆహారాన్ని తీసుకునే సమయంలో మంచి నీటితో పాటు ఎలాంటి లిక్విడ్స్ కూడా తీసుకోకూడదు. కేవలం ఆహారాన్ని తీసుకున్న 30 నిమిషాల తర్వాత మాత్రమే మంచి నీళ్లు లేదా ఇతర లిక్విడ్స్ తీసుకోవాలి. ఇలా చేయడం చాలా అవసరం అని గుర్తుంచుకోండి. అంతే కాకుండా ఆహారం తీసుకునే 30 నిమిషాలు ముందు కూడా ఎలాంటి లిక్విడ్స్ తీసుకోకూడదు.

ఒకవేళ మంచి నీళ్ళను ఆహారం తీసుకునే సమయంలో తాగాలనుకుంటే చాలా నెమ్మదిగా సిప్ చేయాలి. ఎక్కువ మోతాదులో మంచి నీరును తీసుకోవడం వల్ల వాంతులు, వికారం, డయేరియా మరియు చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనబడతాయి.

ప్రతి రోజు ఆహారాన్ని బ్యాలెన్స్‌గా తీసుకోండి. ప్రోటీన్ ఉండే పదార్థాలను తప్పకుండా తీసుకోవాలి. ఎలాంటి ఆహార పదార్థాలలో అయితే ఎక్కువగా కొవ్వు పదార్థాలు, పంచదార ఉంటుందో వాటిని తీసుకోకపోవడమే మంచిది అని గుర్తుంచుకోండి.

ఆల్కహాల్ అస్సలు తీసుకోకూడదు. కెఫైన్ వీలైనంత వరకు తగ్గించండి, ఎందుకంటే కెఫైన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురి అవుతారు. విటమిన్, మినరల్స్ సప్లిమెంట్స్‌ను డాక్టర్ చెప్పిన విధంగా తప్పకుండా తీసుకోవాలి. అయితే ఆహారాన్ని తీసుకునేటప్పుడు ఎక్కువగా నమిలి తినాలి ఇలా చేయడం వల్ల డైజిషన్ ప్రక్రియ సులువుగా అవుతుందని గుర్తుంచుకోండి.

**లిక్విడ్స్** : సర్జరీ అయిన రోజు లేక తర్వాత రోజు కేవలం లిక్విడ్స్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు క్లియర్ లిక్విడ్స్ తీసుకోవాలని అనుకుంటే వీటిని తప్పకుండా తీసుకోండి. పంచదార కలపకుండా ఎలాంటి జ్యూస్ అయినా తీసుకోవచ్చు. కెఫైన్ లేనటువంటి టీ, కాఫీ, స్కిమ్డ్ మిల్క్, సూప్స్ వంటివి తీసుకోవాల్సి ఉంటుంది. ఇది స్టేజ్ వన్‌కు సంబంధించిన లిక్విడ్ ఫుడ్.



**ప్యూరీడ్ ఫుడ్స్** : వారం రోజుల వరకు లిక్విడ్స్ మాత్రమే తీసుకోమని డాక్టర్స్ సూచిస్తారు. కాకపోతే సర్జరీ చేసిన వారం తర్వాత మాత్రమే ప్యూరీడ్ ఫుడ్స్ తీసుకోవాల్సి ఉంటుంది అంటే వాటి కన్సిస్టెన్సీ అనేది స్మూత్ పేస్టులాగా, మెత్తగా ఉండాలి. ఈ విధంగా రోజుకు 3 నుండి 6 వరకు స్మాల్ మీల్స్‌గా తీసుకోవచ్చు. అయితే ఒక మీల్‌లో కేవలం నాలుగు నుండి ఆరు టేబుల్ స్పూన్ల ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని గమనించాలి.

ఇలా ప్యూరీడ్ ఫుడ్‌ని తీసుకుంటున్నా సరే ఆహారాన్ని చాలా నెమ్మదిగా తినాలి. అయితే ఈ విధమైన ప్యూరీడ్ ఫుడ్స్ తీసుకున్నప్పుడు ఎటువంటి సాలిడ్ పీసెస్ ఆహారంలో ఉండకుండా చూసుకోవాలి. దీనిలో భాగంగా క్రీమీ సూప్స్, గుడ్లు, కాటేజ్ చీజ్, గ్రౌండ్ మీట్ వంటి పదార్థాలతో పాటుగా ఒక లిక్విడ్‌తో బ్లెండ్ చేసుకుని తినొచ్చు. లిక్విడ్స్‌తో బ్లెండ్ చేయడానికి మంచి నీరు, స్కిమ్డ్ మిల్క్, జ్యూస్, సూప్ లాంటి లిక్విడ్స్‌ని ఉపయోగించవచ్చు.

**సాఫ్ట్ ఫుడ్** : ప్యూరీడ్ ఫుడ్స్‌ను కొన్ని వారాల పాటు తీసుకున్న తరువాత సాఫ్ట్ ఫుడ్స్‌ను మీరు డైట్‌లో భాగంగా తీసుకోవచ్చు. కానీ మీరు తీసుకునే ఆహారం చాలా మెత్తగా మరియు తాజాగా ఉంటేనే ఎంపిక చేసుకోండి. రోజుకు మూడు నుండి ఐదు స్మాల్ మీల్స్‌గా తీసుకోవాలి. సాఫ్ట్ ఫుడ్స్‌లో భాగంగా పొట్టు తీసి ఉడికించిన కూరగాయలు, అన్నం, గుడ్లు, ఫిష్, లీన్ మీట్ వంటి మొదలైన ఆహార పదార్థాలను తీసుకోవచ్చు.

**సాలిడ్ ఫుడ్** : గ్యాస్ట్రిక్ బైపాస్ డైట్‌లో భాగంగా 8 వారాల తర్వాత సాలిడ్ ఫుడ్స్‌ను తీసుకోవచ్చు. సాలిడ్ ఫుడ్స్‌ని తీసుకున్నప్పుడు కొన్ని ఆహార పదార్థాలు నొప్పి, వికారం, వాంతులు వంటి వాటికి గురి చేస్తాయి. కాబట్టి వాటిని తీసుకున్నప్పుడు మీరు ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొంటే కొన్ని మార్పులు చేసుకోండి. సాలిడ్ ఫుడ్స్ లో భాగంగా బ్రెడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్, పచ్చి కూరగాయలు, ఉడికించిన కూరగాయలు, ఫ్రైడ్ ఫుడ్స్, పాప్ కార్న్ వంటి ఇతర స్పైసీ ఫుడ్స్ కూడా తీసుకోవచ్చు.

ఈ విధంగా గ్యాస్ట్రిక్ బైపాస్ డైట్ ని పాటించడం వల్ల సర్జరీ నుంచి త్వరగా రికవరీ అవుతారు. అంతేకాకుండా మీ ఆరోగ్యంతో పాటు బరువు కూడా పర్ఫెక్ట్‌గా ఉంటుంది. సర్జరీ తరువాత అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వలన ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పైగా మోతాదుకు మించి ఆహారాన్ని తీసుకోవడం వలన ఎన్నో రకాల కాంప్లికేషన్స్‌ను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోండి. కాబట్టి ఇలాంటి మార్పులను మీ డైట్ లో చేసుకొని సర్జరీ నుండి వీలైనంత త్వరగా రికవరీ అవ్వండి.

# జ్ఞాపకశక్తికి అద్భుతమైన దివ్యౌషధం ఎండుద్రాక్ష



సాధారణంగా పాలను సూపర్ ఫుడ్‌గా పిలుస్తారు. అదే పాలలో కొద్దిగా ఎండు ద్రాక్ష మిక్స్ చేస్తే..ఇక దివ్యౌషధమే. ఆహారపు అలవాట్లు, జీవనశైలి ఆధారంగా ఆరోగ్య స్థితి ఉంటుంది. ఆహారపు అలవాట్లు బాగుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. లేకుంటే అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. మెరుగైన ఆరోగ్యం కోసం డైట్‌లో పాలు, ఎండుద్రాక్ష చేర్చుకుంటే చాలని..అద్భుత ప్రయోజనాలు కలుగుతాయంటున్నారు వైద్య నిపుణులు.

ఎండుద్రాక్ష, పాలు. రెండూ ఆరోగ్యానికి చాలా మంచివి. రెండింట్లోనూ పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి. ఎండుద్రాక్షలో హెల్తీ ఫ్యాట్స్, ఫైబర్, కాపర్, ఐరన్, కాల్షియం, పొటాషియం పుష్కలంగా ఉంటే..పాలలో కాల్షియం, ప్రోటీన్లు, విటమిన్ డి అత్యధికంగా ఉంటాయి. అందుకే ఈ రెండూ కలిపి ప్రతిరోజూ తాగితే శరీరంలో పోషక పదార్థాల లేమి తలెత్తదు. ఫలితంగా గంభీరమైన రోగాలు దూరమౌతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

**జ్ఞాపక శక్తి** : రోజూ క్రమం తప్పకుండా పాలు, ఎండుద్రాక్ష కలిపి తీసుకోవడం వల్ల ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యల్ని జయించవచ్చు. ముఖ్యంగా మెమెరీ పెరుగుతుంది. మెదడు పనితీరు అద్భుతంగా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే బుద్ధి వికసితమౌతుంది. రాత్రి పడుకునేముందు పాలలో ఎండుద్రాక్ష కలిపి తాగడం వల్ల సుఖమైన నిద్ర పడుతుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి ఇదొక మంచి ఔషధం కాగలదు. త్వరగా పడుకునేందుకు కూడా దోహదమౌతుంది.

**ఎముకలు పటిష్టం** : పాలు, ఎండుద్రాక్ష రెండింట్లోనూ కాల్షియం పుష్కలంగా ఉంటున్నందున..ఈ రెండు కలిపి తీసుకోవడం ద్వారా ఎముకలకు బలం చేకూరుతుంది. ఎండుద్రాక్షలో ఉండే బోరాన్ అనే కెమికల్ ఎముకలకు చాలా లాభదాయకం. అటు కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. ఫ్రాక్చర్ కారణంగా ఏర్పడే గాయాలు తగ్గుతాయి. ఇతర చాలా గంభీరమైన రోగాలకు పాలు-ఎండుద్రాక్ష మిశ్రమం అద్భుతంగా పనిచేస్తుంది.

ఎండుద్రాక్షలో జీర్ణానికి తోడ్పడే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడమే కాకుండా మెటబోలిజంను వృద్ధి చేస్తుంది. శరీరంలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. కోలన్ పనితీరు మెరుగుపడుతుంది. శరీరాన్ని ఎప్పటికప్పుడు డీటాక్స్‌పై చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటాము.

# ఉల్లిపాయలతో మధుమేహం నియంత్రణ



కొన్నేళ్లుగా మారిన జీవన శైలి, ఆహార అలవాట్లు, కాలుష్యం వంటి వాటి వల్ల మధుమేహం బాధితులు పెరిగిపోతున్నారు. ఒక్కసారి మధుమేహం బారిన పడితే జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మన రక్తంలో చక్కెర స్థాయిలను, రక్త పోటును నియంత్రించడంలో తోడ్పుతాయి. అలా ఉల్లిపాయలు మధుమేహం నియంత్రణకు తోడ్పడుతాయని తాజాగా శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో గుర్తించారు.

ఎండోక్రైన్ సొసైటీ సమావేశంలో.. అమెరికాలోని శాన్ డియాగోలో ఇటీవల జరిగిన 97వ ది ఎండోక్రైన్ సొసైటీ వార్షిక సమావేశంలో శాస్త్రవేత్తలు ఉల్లిపాయలు, మధుమేహంపై చేసిన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఉల్లిలోని 'అల్లియమ్ సెపా' అనే పదార్థం మన రక్తంలో చక్కెర స్థాయిలు 50 శాతం వరకు తగ్గించేందుకు తోడ్పడుతున్నట్టు తాము గుర్తించినట్టు వెల్లడించారు. అంతేగాకుండా శరీరంలో కొలెస్ట్రాల్ ను నియంత్రణలో ఉంచడంలోనూ పనిచేస్తున్నట్టు తెలిపారు.

**ఎలుకలపై పరిశోధన చేసి..**

ఈ అంశానికి సంబంధించి ఎలుకలపై పరిశోధన చేశామని శాస్త్రవేత్తలు వివరించారు. మొత్తం నాలుగు గ్రూపులుగా ఎలుకలను తీసుకున్నామని.. అందులో ఒక గ్రూపు మధుమేహం లేని ఎలుకలు అని చెప్పారు. మధుమేహం ఉన్న మూడు గ్రూపుల్లోని ఎలుకలకు.. ఉల్లి నుంచి తీసిన పదార్థాలను వేర్వేరు డోసుల్లో అందించి పరిశీలించామని తెలిపారు.

మధుమేహం ఉన్న మూడు గ్రూపుల్లోని ఎలుకల్లో.. 'అల్లియమ్ సెపా' డోసు ఎక్కువగా ఇచ్చిన గ్రూపులో రక్తంలో చక్కెర స్థాయిలు బాగా నియంత్రణలో ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. అదే సమయంలో వాటిలో కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గాయని వివరించారు.

ఉల్లిపాయలు తీసుకోవడం వల్ల మరో లాభం కూడా ఉందని.. వాటి వల్ల పెద్దగా కెలోరీలు కూడా అందకపోవడం వల్ల అంతిమంగా శరీరంలో గ్లూకోజ్ శాతం పెరిగే పరిస్థితి కూడా ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికి సంబంధించి మనుషులపైనా ప్రయోగాలు చేయాల్సి ఉందని వివరించారు.

# గుండె, రక్తపోటు వంటి ఎన్నో వ్యాధులకు దానిమ్మ జ్యూస్



ఆరోగ్యకరమైన శరీరం పొందడానికి, ఖచ్చితంగా ఆహారంలో పండ్లు, వాటి రసాన్ని చేర్చుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. ఇలాంటి వాటిలో దానిమ్మ పండు ఎంతో ఉత్తమంగా పని చేస్తుంది. రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని రుజువు చేస్తుంది. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల అనేక వ్యాధులు నయం అవుతాయని మీకు తెలుసా. ఉదయాన్నే పరగడుపున దానిమ్మ రసం తాగితే రోజంతా శరీరంలో శక్తి ఉంటుంది. శరీరంలో రక్తం లేకపోవడం తొలగిపోయి హిమోగ్లోబిన్ పెరుగుతుంది. విటమిన్ కె, విటమిన్ బి, విటమిన్ ఎ, విటమిన్ డి, కాల్షియం, పొటాషియం, జింక్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్, ప్రోటీన్లు కూడా దానిమ్మ రసంలో ఉన్నాయి.

**ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు..**

1- రక్తహీనత దూరం- మీ శరీరంలో ఐరన్ లోపం ఉంటే.. మీరు రక్తహీనతకు గురైనట్లయితే, మీరు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. రోజూ ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల శరీరానికి తగినంత ఐరన్ అందుతుంది. దీని కారణంగా, శరీరంలో ఎర్ర రక్త కణాలు పెరుగుతాయి. రక్తహీనత ఫిర్యాదు అనే సమస్య ఇకపై రాదు.

**2- రోగనిరోధక శక్తిని పెంచండి-** ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. దానిమ్మ రసంలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఐరన్ పుష్కలంగా ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. శరీరాన్ని వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది.

**3- ముఖం మెరిసిపోతుంది-** దానిమ్మ రసం చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల చర్మం మెరుస్తుంది. దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా చేస్తాయి.

**4- గర్భిణీ స్త్రీలకు ప్రయోజనకరమైనది-** గర్భధారణ సమయంలో, మహిళల శరీరంలో విటమిన్లు, ఇనుము లేకపోవడం తరచుగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. దీని కారణంగా, శరీరంలో విటమిన్లు, ఐరన్ లోపం నెరవేరుతుంది. శరీరంలో రక్తానికి కొరత ఉండదు. శక్తి కూడా లభిస్తుంది.

**5- గుండెకు మేలు చేస్తుంది-** రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మలో కొలెస్ట్రాల్‌ని తగ్గించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా దానిమ్మ రసం ఖాళీ కడుపుతో తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది.

**6- రక్తపోటు నియంత్రణ-** దానిమ్మపండులో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. అధిక రక్తపోటు ఉన్నవారు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

# కరివేపాకుతో జుట్టుకు అనేక లాభాలు



కరివేపాకు.. దీనికి కొన్ని ప్రాంతాల్లో కళ్యామాకు అని కూడా అంటారు. చెట్టు సుగంధభరితమైన ఆకులు గల ఒక అందమైన పొద మొక్క లేదా చిన్న చెట్టు. దీని ఆకులని కరివేపాకు అంటారు. మీ అందరికీ బాగా పరిచయం ఉంటుంది. మసాలా దినుసులు, మీ కూరగాయలను రుచిగా మార్చడంలో దీని పాత్ర అధికంగా ఉంటుంది. ఇది ఎక్కువగా ఇండియా, శ్రీలంకలలో కనిపిస్తుంది. కూర, చారు, పులుసు, వగైరా వంటకాలలో సువాసనకోసం వాడుతారు. అంతేకాదు కరివేపాకు వంటలను రుచికరంగా మార్చడంలో మాత్రమే కాకుండా మీ అందాన్ని మరింత మెరుగులు దిద్దడంలో కూడా సహాయ పడుతాయి. వాస్తవానికి, కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. దీనితో పాటు కరివేపాకులో బి విటమిన్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇవి హెయిర్ ఫోలికల్స్‌లో మెలనిన్ ఉత్పత్తి చేయడానికి పని చేస్తాయి. దీంతో జుట్టు నల్లగా, తెల్లజుట్టు సమస్య దూరమవుతుంది. కనుక ఇది కొంత ప్రభావం చూపుతుంది.

**జుట్టు కోసం కరివేపాకుతో ప్రయోజనాలు**

కరివేపాకు కూడా జుట్టు తెల్లబడకుండా కాపాడుతుంది. వాస్తవానికి, కరివేపాకు మెలనిన్ ఉత్పత్తి చేయడానికి పని చేస్తుంది. మెలనిన్ లోపం వల్ల జుట్టు తెల్లగా మారుతుంది. ఇలాంటి సమయంలో కరివేపాకుతో చేసిన హెయిర్ మాస్క్‌ని జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు నెరిసే సమస్య దూరం అవుతుంది. దీనితో పాటు, జుట్టు కూడా మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.

**కరివేపాకు హెయిర్ మాస్క్ ఎలా తయారు చేయాలి**

గ్యాస్ మీద పాన్లో, 2 టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేడి చేయండి.

ఇప్పుడు దానికి 10-12 కరివేపాకు వేసి 3-4 నిమిషాలు ఉడికించాలి. అప్పుడు గ్యాస్ ఆఫ్ చేయండి.

ఇప్పుడు 20 నిమిషాలు చల్లబరచడానికి పక్కన పెట్టండి. మీ కరివేపాకు హెయిర్ మాస్క్ సిద్ధంగా ఉంది.

కరివేపాకు హెయిర్ మాస్క్ ఎలా అప్లై చేయాలి

జుట్టు మీద కరివేపాకు మాస్క్ అప్లై చేయడానికి, రెండు చేతులతో మొత్తం జుట్టు మీద అప్లై చేయండి. ముందుగా ఈ మాస్క్‌తో హెయిర్ రూట్‌లను మసాజ్ చేసి, తర్వాత జుట్టు మొత్తానికి బాగా అప్లై చేయండి. ఒక గంట తర్వాత, ఇప్పుడు జుట్టును బాగా కడగాలి. మీ జుట్టు చాలా మృదువుగా.. మెరిసేలా మారడం మీరు చూస్తారు.

కరివేపాకు, పెరుగుతో కూడా హెయిర్ మాస్క్ తయారు చేసుకోవచ్చు

మీరు కరివేపాకు, పెరుగుతో హెయిర్ మాస్క్‌ని కూడా తయారు చేసుకోవచ్చు. ఈ మాస్క్ చుండ్రును తొలగించడంలో కూడా సహాయపడుతుంది. దీని కోసం, ఒక గిన్నె పెరుగులో 3-4 కరివేపాకులను పేస్ట్ అయ్యే వరకు కలపండి. తర్వాత జుట్టుకు బాగా పట్టించాలి. ఇది మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది.

## ఏపీ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** కండ్లకలకలు పట్ల అనేక అపోహలు ఉంటాయని , కండ్లకలక సోకిన వ్యక్తి యొక్క కళ్లను చూస్తే వ్యాపిస్తుంది అనేది కేవలం అపోహ మాత్రమేనని వాస్తవానికి కండ్లకలక సోకిన వ్యక్తి యొక్క ద్రవాలను తాకిన తర్వాత చేతి నుండి కంటికి పరిచయం చేయడం ద్వారా మాత్రమే సంక్రమిస్తుందని ప్రముఖ హెూమియో వైద్య నిపుణులు డాక్టర్ గాడి ప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆర్అండ్బి రైతు బజార్లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని కండ్లకలకలు రాకుండా ముందు జాగ్రత్తగా హెూమియో మందును ఉచితంగా పంపిణీ చేశారు .ఈ సందర్భంగా డాక్టర్ గాడి ప్రసాద్ మాట్లాడుతూ కండ్లకలక అనేది చిన్నపాటి ఇన్ఫెక్షన్ మాత్రమేనని అంధత్వానికి కారణం కాదని కండ్లకలక వస్తే భయపడవలసిన అవసరం ఏమీ లేదని మందులు వాడితే సరిపోతుందని అన్నారు .ఈ వైద్య శిబిరాన్ని రైతులు,వినియోగదారులు సుమారు వెయ్యి మంది సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ అధికారి సిహెచ్ వి సతీష్ ,సూపర్వైజర్ ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దొండవాక, బోయపాడు జెట్టిల స్థలాలను పరిశీలించిన జెసి ఎం.జాహ్నవి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా తీర ప్రాంతంలో ఉన్న పెద్ద తీనార్ల వద్ద గల దొండవాక, రాజయ్యపేట వద్ద గల బోయపాడు లలో జెట్టీలు, చందనాడ ఫిష్ లాండింగ్ సెంటర్ నిర్మాణానికి కేటాయించిన భూములను జాయింట్ కలెక్టర్ జాహ్నవి పరిశీలించారు. జట్టిల నిర్మాణానికి చేపట్టిన చర్యలను వేగవంతం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె అక్కడ ఉన్న బాలుర, బాలికల రెండు పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులందరూ బాగా చదువుకొని మంచి పౌరులుగా తయారు కావాలని వారికి చెప్పారు. ఈ పర్యటనలో ఎన్ ఏ ఓ బి ఎస్ డి సి జ్ఞాన వేణి, మత్స్య శాఖ ఏడి లక్ష్మణరావు, నక్కపల్లి తాసిల్దార్ అంబేద్కర్, ఎన్ ఏ ఓ బి, నక్కపల్లి మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా సూరిశెట్టి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వైయస్ ఆర్ సిపి అనకాపల్లి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా సూరిశెట్టి రమణ అప్పారావు నియమితులయ్యారు. యింత వరకు పట్టణ ప్రధాన కార్యదర్శిగా పార్టీకి సేవలందించిన రమణ అప్పారావు ను పార్టీ అధిష్టానం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాద్యతలను అందించారు. 1994లో కాంగ్రెస్ పార్టీలో చేరిన రమణ అప్పారావు పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ, దివంగత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం, వైయస్ జగన్ మోహన్ రెడ్డి స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుండి పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఉత్తరాంధ్రలో రాజకీయ ఉద్దండులు దాడి వీరభద్రరావు,కొణతాల రామకృష్ణ, స్వర్గీయ ద్రోణంరాజు సత్యన్నారాయణ,గుడివాడ గురునాధరావు, బలిరెడ్డి సత్యారావు నాయకుల సారథ్యంలో పనిచేసిన రమణ అప్పారావు కు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

## మణిపూర్ అల్లర్లపై ర్యాలీ

**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** ఇటీవల జరిగిన మణుపూర్ అల్లర్ల గురించి సోషల్ మీడియాలో ప్రకటనలలో పైకి వచ్చిన ఈ దారుణాన్ని చూసిన గిరి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు గిరిజన పై ఇలాంటి దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని శనివారం అరకు వేలి సిపిఎం సిపిఐ పార్టీలు మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో సిపిఎం నాయకులు పొద్దు బల్దేవ్ మాట్లాడుతూ ఇంత దారుణాన్ని వరిగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు గిరిజనులకు ఇంత దారుణం జరిగినప్పుడు మన ఏజెన్సీ గిరి ప్రజా నాయకులు ప్రతినిధులు ఇంతవరకు స్పందించలేదని ఇది మన గిరిజనులకు ఎంతో అవమానకరమని ఆయన అన్నారు ఇంత దారుణాలు జరుగుతుండగా ప్రభుత్వ ప్రతినిధులు అధికారులు ఏం చేస్తున్నారు అని ఆయన అన్నారు మన గిరిజన ప్రజా సంఘాలు ప్రతినిధులు అందరం కలిసి ఇంత దారుణంపై ఒడిగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకునేంతవరకు పోరాడుతామని ఆయన పిలుపునిచ్చారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నియోజకవర్గ సమీక్షలు



**విజయనగరం:** ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా నియోజకవర్గ సమీక్షలను నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్ఛార్జి మంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎంఎల్ఏ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి విజయనగరం నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టరేట్ ఆడిటోరియంలో, మంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. విజయనగరం మున్సిపాలిటీ, పంచాయితీరాజ్, గృహనిర్మాణం, టిడ్కో, ఉపాధిహామీ, పంచాయితీ, విద్య, వైద్యం, నీటిపారుదల, విద్యుత్, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల అంశాలపై సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకొని గత నాలుగేళ్లుగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. పట్టణంలో రహదారులను విస్తరించి, అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అంబటిసత్రం జంక్షన్ కొత్తపేట అంతర్ జిల్లా ఆర్అండ్ బి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. పెద్దచెరువులో పూడిక తొలగించేందుకు సుమారు రూ.2కోట్లు అవసరమని అన్నారు. గూడ్సు షెడ్ వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్ ప్రారంభానికి త్వరగా అనుమతి ఇప్పించాలని కోరారు. గుంకలాం లేఅవుట్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ నాలుగేళ్లుగా పట్టణ ప్రజలకు త్రాగునీటికి పెద్దగా ఇబ్బందులు లేవని, తారకరామ తీర్థసాగర్ ను త్వరగా పూర్తి చేస్తే, సమస్య శాశ్వతంగా పరిష్కరించవచ్చునని తెలిపారు. ముషిడిపల్లి పైప్లైన్ను రూ.53 కోట్లతో మార్చాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో జలజీవన్ మిషన్ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ నాటికి పట్టణంలోని రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు.

ఇన్ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు, అన్ని నియోజకవర్గాలపై సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎంఎల్ఏల ద్వారా సమస్యలను తెలుసుకొని, వాటిని జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోరిక మేరకు విజయనగరం మండలంలో అదనంగా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, పట్టణంలోని గాజులరేగలో రైతు భరోసా కేంద్రం మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం చక్కని కార్యక్రమమని, ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం వల్ల, స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని కోరారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని అన్నారు. జలజీవన్ మిషన్ పనులను ప్యాకేజీ రూపంలోనే కాకుండా, అవసరమైతే విడివిడిగా టెండర్లు పిలిచి, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అంచనాలు, టెండర్లు అంటూ అధికారులు కాలయాపన చేయకుండా, ప్రజల అత్యవసర సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి కోరారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఓ ఎం.గణపతిరావు, సిపిఓ పి. బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాలికపై వృద్ధుడి అఘాయిత్యం




మానసిక దివ్యాంగురాలైన ఓ బాలికపై 73 ఏళ్ళ వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడిన దారుణ ఘటన ఏపీలో కలకలం రేపింది.. మనుమరాలి వయస్సున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఆ వృద్ధుడిని ప్రకాశం పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం సిద్ధినాయునిపాలెంలో మానసిక దివ్యాంగురాలు (17) తల్లితో కలిసి ఉంటోంది. తన తల్లితో కలిసి సాయంత్రం 5 గంటల సమయంలో సైకిల్పై స్థానిక అంగన్వాడీ కేంద్రం దగ్గరకు వెళ్ళింది.. అదే గ్రామానికి చెందిన 73 ఏళ్ళ వృద్ధుడు రుద్రపాటి చిన్న వెంకటచెన్నయ్య ఆమెతో మాటలు కలిపాడు. కుశలప్రశ్నలు వేస్తున్నట్టు నటించి, అనంతరం మాయమాటలు చెప్పి ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు.బాలిక ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి ఆమెను వెతుక్కుంటూ వెళ్ళింది అంగన్వాడీ కేంద్రానికి సమీపంలో ముళ్ళపొదల్లో వెతికింది.. అక్కడ వృద్ధుడి చెరలో ఉన్న బాలిక కన్పించింది. ఆమె కేకలు వేయడంతో స్థానికులు చుట్టుముట్టి వృద్ధుడ్ని పట్టుకునే క్రమంలో తప్పించుకుని పారిపోయాడు. ఈ ఘటనపై బాలిక తల్లి పెద్దారవీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై పులి రాజేష్ నిందితుడిపై అత్యాచారం, పోక్సో సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

దర్యాప్తులో భాగంగా డీఎస్పీ వీర రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం మార్కాపురం అదనపు మొదటి తరగతి ఇన్చార్జి న్యాయమూర్తి ఎమ్.ఎస్ కరీముల్లా ముందు హాజరుపరచగా, నిందితుడికి రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అతడిని మార్కాపురం ఉపకారాగారానికి తరలించారు

# జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని తహతహలాడుతున్న జనం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేయటానికి జనం తహతహలాడుతున్నారని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్ఆర్సిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు . వైసిపి అనకాపల్లి జిల్లా విస్తృత స్థాయి సమావేశం స్థానిక పెంటకోట కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. గ్రామ స్థాయిలోనే పాలన అందిస్తున్న ప్రభుత్వం మనది అని ఆయన అన్నారు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థ అత్యంత పటిష్టంగా పనిచేస్తుంటే, ప్రతిపక్షాలు వారిపై దుష్ప్రచారం చేస్తున్నాయని సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడానికి వారికి నోరు ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కోటి 50 లక్షల మందికి ఒక పైసా లంచం తీసుకోకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని సుబ్బారెడ్డి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎంతమంది కలిసి వచ్చిన వైసీపీకి నష్టం లేదని "మనం ప్రజలను నమ్ముకున్నాం.. మన మీద ప్రజలకు నమ్మకం ఉంది. మనమే గెలుస్తాం" అని సుబ్బారెడ్డి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని గతంలో కన్నా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. త్వరలోనే ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహించి, అవసరమైతే కార్యకర్తలు, నాయకులతో వ్యక్తిగతంగా కూడా మాట్లాడతానని సుబ్బారెడ్డి చెప్పారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అనకాపల్లి జిల్లా వైసిపి ప్రెసిడెంట్ బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీలో పదవులు తీసుకున్నవారు వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్టీ రుణం తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ, మండల స్థాయిలో కార్యకర్తలను ఉత్తేజపరిచి, ఎన్నికలకు సమాయత్తం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వలేని విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 50,000 నుంచి 3 లక్షల రూపాయల వరకు లబ్ధి చేకూరుస్తుందని ఇదే కదా సంక్షేమ రాజ్యం అంటే అని అన్నారు. విద్య, వైద్యం, రైతు, మహిళ సంక్షేమ కోసం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను గ్రామస్థాయికి తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. గ్రామ సచివాలయాలలోనే ప్రజలకు కావలసిన అన్ని పనులు పూర్తి అవుతున్నాయంటే ఈ వ్యవస్థను తీసుకొచ్చిన జగన్మోహన్ రెడ్డికి ఆ ఘనత దక్కుతుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై విమర్శలు చేస్తూనే, వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఇటువంటి పథకాలను పొందుపరచడం వారి రెండు నాలుకల ధోరణికి నిదర్శనమని వీరభద్రరావు విమర్శించారు.

ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాట్లాడుతూ చంద్రబాబు



నాయుడు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్రంలో ఎవరు కోరుకోవటం లేదని చెప్పారు. పార్టీలు అంతర్గత విభేదాలు ఏమైనా ఉంటే వాటిని, పరిష్కరించుకుందామని, సర్దుకుపోయే ధరణిలో పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలని కోరారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా రెండు లక్షల ఇరవై ఎనిమిది వేల కోట్ల రూపాయలను సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నది జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని అన్నారు. ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్క కార్యకర్తకు న్యాయం జరుగుతుందని చెప్పారు. డిసిసిబి చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ, కార్యకర్తకు జగనన్న భరోసా ఉన్నాడన్న నిజానికి తానే నిదర్శనమని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ జెండా కింద ఉన్నాం కాబట్టే మనందరికీ ఇన్ని పదవులు వచ్చాయని, ఇదే స్ఫూర్తితో మిగిలిన కార్యకర్తలు నాయకులు పనిచేసి వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేస్తే మరింతమందికి పదవులు వస్తాయని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రభుత్వం మీద ఎవరైనా తప్పుడు పోస్టులు పెడితే తిప్పి కొట్టవలసిన బాధ్యత మన కార్యకర్తలపై ఉందని చెప్పారు. జడ్పిటిసి ఈర్ల అనురాధ మాట్లాడుతూ 2019 ఎన్నికలలో ఏ ఫలితాలు వచ్చాయో, రానున్న ఎన్నికల్లో కూడా అవే ఫలితాలు రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, కాంద్రేగుల విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల ఊంజల సేవ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెంశ్రీ గౌరీ పంచాయతన దేవస్థానం శ్రీ గౌరీ పరమేశ్వరుల 182వ ఉంజల్ సేవ అత్యంత వైభవంగా జరిగింది దేవాలయ అర్చకులు.అంపోలు గోపాల కృష్ణ శర్మ , పొందూరు సూర్య నారాయణ శాస్త్రి,శేషు, సాయి , వేదవిదులైన పండితులచే ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఉంజల్ సేవలో పెతకంశెట్టి సుజాత, దాడి కృష్ణ శ్రీనివాస్ మోహిని, శరగడం మహాలక్ష్మి నాయుడు లక్ష్మి దంపతులు, కుటుంబంసభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, వర్తకులు కర్రి సన్యాసినాయుడు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 120వ రోజు గోషా ఆసుపత్రిలో విజయవంతంగా 10 రూపాయలకే భోజనాలు పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రౌండ్ టేబుల్ ఇండియా వారి సహకారంతో, శ్రీ స్వామి వివేకానంద సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రతిరోజు ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో గల పేషంట్ల సహాయకులకు 10 రూపాయలకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు. ఈరోజు 120 రోజు విజయవంతంగా రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సుద్ అహ్మద్ గారు భోజనాలను పంపిణీ చేస్తున్నారు. ఈ నారాయణ సేవా కార్యక్రమాన్ని రౌండ్ టేబుల్ ఇండియా వారు, రౌండ్ టేబుల్ సంస్థ వారు సేవా దృక్పథంతో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ భోజనాల పట్ల అందరూ కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ భోజనాలు పంపిణీ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సుద్ అహ్మద్ గారు, వివేకానంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



వివేకానంద సంస్థ ఆశ్రమ వాసి స్వర్గీయ మజ్జి. సూర్యకాంతం అస్థికలను వివేకానంద సంస్థ అధ్యక్షులు అప్పారావు, కాశి గంగానదిలో అస్థికలను కలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. **విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్)**

# అలర్ట్ లఘు చిత్రం టీజర్ విడుదల



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దాబా గార్డెన్స్ నందు అలర్ట్ లఘు చిత్రం టీజర్ విడుదల అలర్ట్ లఘు చిత్రం టీజర్ ను రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమ మంత్రి చెల్ల బోయిన శ్రీనివాస్ వేణు , రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు ఎలాగ మోసం చేస్తారో సామాన్యులకు అవగాహన కలిగించే విధంగా డైరెక్టర్ ఎమ్. నరేష్ కుమార్ గారు థియోటర్ ఆఫ్ ఆర్ట్స్ ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థి చక్కగా చూపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ అలర్ట్ లఘు చిత్రం టీజర్ విడుదలకు రాష్ట్ర బిసి సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్. నాగ మల్లయ్య, భార్గవ్ . శ్యామ్ కుమార్ సాయి రామచంద్ర రావు, శివ చరణ్, పాల్గొన్నారు.

# నక్కపల్లిలో విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ రాష్ట్ర విద్యాశాఖ ప్రవీణ్ ప్రకాష్ పర్యటించారు. నాడు నేడు పనులు వాటి నాణ్యమైన వాటిని వాడుతున్న రో లేదంటే వెంటనే తెలియజేయండి అని ప్రిన్సిపాల్ శైలజ కు సూచనలు ఇచ్చారు ప్రభుత్వం కళాశాల లో విద్యార్థుల యూనిఫామ్ క్రమశిక్షణ ను సూచి మెచ్చుకున్నారు. చాలా కళాశాలకు వెళ్లిన ఇక్కడ విద్యార్థుల పట్ల అధ్యాపకుల పట్ల మంచి ప్రమాణలు పారిశుధ్య ఇతర విషయాలు మేరుగగా ఉన్నాయని అభినందనలు తెలిపారు.ఈ పర్యటన లో భాగంగా ప్రవీణ్ ప్రకాష్ తో పాటు విద్యా శాఖ అధికారులు నక్కపల్లి మండలం వైస్ ఎం పీపీ నారాయణ రావు ఇతర అధికారులు ఉపాధ్యాయులువి అప్పారావు కళాశాల సిబ్బంది భాస్కర్ నాయకులు నానాజీ తదితరులు పాల్గొన్నారు.

# 24 వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కె.కె రాజు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఉత్తర నియోజక వర్గం 24వార్డు నక్కవానిపాలెంలో 8లక్షల రూపాయల వ్యయంతో ఇందిరాగాంధీ పార్కు అభివృద్ధి కోసం మరియు 30లక్షల రూపాయల వ్యయంతో నక్కవానిపాలెం ప్రాంతంలో UGD డ్రైనేజీ మరమ్మతులు మరియు మంచి నీటి పైప్ లైన్ మరమ్మత్తు కోసం 24వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి గారి ఆధ్వర్యంలో నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కు వద్ద శంకుస్థాపన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు పాల్గొని కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో AE శ్రీరామ్ మూర్తి, JCS మండల కన్వీనర్ మురళి క్రిష్ణ రెడ్డి,24వార్డు గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దయ చిల్డ్రన్ హోమ్ లో శ్రీరామ్ జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** సమాజ సేవకులు ఎస్ డి గ్రూప్ అధినేత . కాంద్రేగుల శ్రీ రామ్ జన్మదిన వేడుకలు శ్రీరామ్ యువసేన ఆధ్వర్యంలో వెంకుపాలెంలో దయ చిల్డ్రన్స్ హోమ్ లో ఘనంగా జరిగాయి. శ్రీరామ్ యువసేన ఈ సందర్భంగా పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీరామ్ సోదరులు కాంద్రేగుల వెంకట్ , సుబ్రహ్మణ్యం , సర్వేజనా ఐక్యవేదిక అధ్యక్షులు కోరుబిల్లి పరి , విల్లూరి వీర సంతోష్ కుమార్, బుద్ధ బుజ్జి , బుద్ధ గంగాధర్ పాల్గొన్నారు ఈ కార్యక్రమం కాంద్రేగుల శ్రీరామ్ యువసేన ఆధ్వర్యంలో జరిగింది.

# 47వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కె.కె రాజు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఉత్తర నియోజకవర్గం 47వార్డు 1086274 మరియు 1086275 సచివాలయాల పరిధి అంబేద్కర్ ఎస్టేట్ సురేష్ రామ్ నగర్, బాపూజీ నగర్ పెద్ద కొత్తూరు,అరుంధతి నగర్,చంద్రగిరి నగర్ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వము కార్యక్రమం నిధులు ద్వారా నలభై లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైన్లు, మెట్లు పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం పెద్దకొత్తూరు బాబుజగజ్జీవనరావు విగ్రహం వద్ద మరియు రంజీఎస్టేట్ స్కూల్ ఎదురుగా స్టాండింగ్ కమిటీ మెంబర్,47వార్డు కార్పొరేటర్ కంటి పాము కామేశ్వరి ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు పాల్గొని కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ముందుగా బాబు జగజ్జీవనరావు గారి విగ్రహనికి పులామాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో DE భరణి, AE అర్చన, 47వార్డు వసంతల అప్పారావు,ముక్క రమణ,యం.వి రమణ, సురేష్, నరసింగ్, భోగి, రమేష్, అనిల్, చందురెడ్డి, సాయి, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గోదాదేవి అమ్మవారి తిరునక్షత్ర మహోత్సవం





**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసి ఉన్న శ్రీ కలికి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గోదావరి వార్షిక తిరునక్షత్రం మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా శనివారం తెల్లవారుజామున కొండపైగల వెంకటేశ్వర స్వామి వారి మూల విరాట్ కు అర్చకులు సంకర్షణపల్లి రాజగోపాలకృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకము నివేదనలో తీర్థ గోష్టి నిర్వహించిన తర్వాత భక్తులందరకూ సౌకర్యం కల్పించారు.

కొండ దిగువున గల ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి వారి ఆలయంలోనూ ఉపాలయాలలోనూ దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు అర్చకులు పేస్పాటు వెంకట శేషాచార్యులు నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, భాగవతం గోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో నిత్య కార్యక్రమములు నిర్వహించారు.

అనంతరం గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధి వద్ద ఆలయ అర్చకులు ముందుగా విశ్వక్సేన పూజ పుణ్యాహ వాచనము నిర్వహించి గోదా దేవి అమ్మవారి మూలవిరాట్ కు ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకము నిర్వహించారు.

అనంతరం గోదా దేవి అమ్మవారికి నూతన వస్త్ర అలంకరణలు పూర్తి చేసి నావారా దివ్య ప్రబంధం సేవా కాలము నిర్వహించారు.

అనంతరం కుంకుమార్చన విశేషప్రసాద్ నివేదనలు తీర్థ గోష్టి భక్తులందరకు ప్రసాద్ వినియోగము నిర్వహించారు.

అనంతరం భక్తుల ఆర్థిక సహకారంతో ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదానంలో భాగంగా సుమారు వెయ్యి మందికి ఉచిత అన్నదానమును నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది గురవయ్య, మహేష్, హెటిరో ప్రతినిధి కే. సీతా రామాచార్యులు, నున్న సుభాష్ పలు గ్రామాలకు చెందిన సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# సొంత పార్టీయే పోవాలి అంటూ టిడిపి నేత స్లోగన్.. దెబ్బకు లీడర్లంతా షాక్



అతనో పార్టీకి లీడర్.. కానీ.. అతను ఓ సభలో సొంత పార్టీయే పోవాలి.. అంటూ స్లోగన్ ఇచ్చారు.. తీరా గమనించే లోపే జరిగాల్సిందంతా జరిగిపోయింది.. ఈ స్లోగన్ ఏపీలో చర్చనీయాంశంగా మారింది. కడప జిల్లాలో ఓ టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి చేసిన స్లోగన్ ఆ పార్టీ నేతలను తలపట్టుకునేలా చేసింది. ఈనెల 19న టిడిపి బస్సు యాత్ర కడపకు చేరుకున్న సందర్భంలో టీడీపీ నేతలు అందరూ ఒక వేదిక పైకి చేరి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గడుతూ మీటింగ్ నిర్వహించారు. ఇంతవరకు బాగానే ఉన్నా సదరు కడప టిడిపి నేత మాత్రం స్టేజిపై ఒక్కసారిగా స్లోగన్ చేస్తూ సైకిల్ పోవాలి అని మాట్లాడటంతో ఒక్కసారిగా స్టేజి మీద ఉన్న నేతలు అందరూ అవాక్కయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించిన నేతలు అందరూ స్టేజీ మీద ఉండగా అందరి సమక్షంలో సదరు కడప నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ అమీర్ బాబు తన ప్రసంగాన్ని ఇస్తూ ప్రభుత్వ వ్యతిరేక విధానాన్ని స్టేజిపై మాట్లాడి చివర్లో స్లోగన్ చేస్తూ సైకిల్ పోవాలి అని అనడంతో స్టేజి మీద ఉన్న జిల్లా నేతలందరూ షాక్ అయి అమీర్ బాబు చేతిలో ఉన్న మైక్ ను లాగేశారు.

# ఆంధ్రా మెడికల్ కాలేజీలో 200 ఏళ్లనాటి అస్థిపంజరాలు



సరిగ్గా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశాఖపట్నం లోని ఆంధ్రా వైద్య కళాశాల ఎన్నో చారిత్రక విశేషాలకు కేంద్ర బిందువు లాంటిది. విద్యార్థులకు వైద్య శాస్త్రం పై అవగాహన పెంచేందుకు ఈ కళాశాలలో ఆనాటి ప్రొఫెసర్లు తీసుకున్న చర్యలు చారిత్రక ఘట్టాలుగా మిగిలి నిరంతరం స్ఫూర్తిని రగిలిస్తూ ఉన్నాయి. అలాంటి ఒక క్లాసిక్ ఉదాహరణనే ఈ స్టోరీ.ఆంధ్రా మెడికల్ కళాశాల అనాటమీ డిపార్ట్మెంట్‌లోని 'అలమరాలో అస్థిపంజరాల'కు చాలా పెద్ద నేపథ్యం ఉంది. అక్షరాలా వైద్య విద్యార్థుల బోధన కోసం అనాటమీ మ్యూజియం విభాగానికి చెందిన ఈ అస్థిపంజరాలు దంతాలు, చెక్క తో 200 సంవత్సరాల క్రితం తయారు చేయబడ్డవని తెలుసుకుంటే ఆశ్చర్యపడక మానరు. ఈ అరుదైన దంతపు అస్థిపంజరం, దీని ఎముకలు మానవ అస్థిపంజరం తరహాలో అత్యంత ఖచ్చితత్వంతో చెక్కబడ్డాయి, ఇక్కడ ఆంధ్రా మెడికల్ కాలేజీలోని అనాటమీ మ్యూజియంలో ప్రతిష్ఠాత్మకమైన నిధిగా ప్రస్తుతం ఇవి ఉన్నాయి.

డాక్టర్ కృష్ణారావ్ చొరవతోనే ఈ దంతపు అస్థిపంజరం, ఎత్తు 5 అడుగుల ఆరు అంగుళాల కాగా బరువు 231 పౌండ్లు అంటే 104.78 కిలోలు. రెండు శతాబ్దాల క్రితం చెక్కిన ఈ అస్థిపంజరలాను చెక్కిన శిల్పి యొక్క చాతుర్యాన్ని, నైపుణ్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. 1798-1832 మధ్య కాలంలోని రాజా సెర్ఫోజీకు చెందిన తంజావూరులోని ప్రసిద్ధ సరస్వతీ మహల్ నుంచి వీటిని సేకరించబడడం జరిగింది. ఈ అస్థిపంజరం 1805 -1810 మధ్యకాలంలో తయారు చేసి ఉందిచ్చాన్నది ఒక అధ్యయనం.

# కోలా గురువులని మర్యాద పూర్వకంగా కలిసిన పేడాడరమణకుమారి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు విశాఖ డీ.సి.సి.బి బ్యాంక్ చైర్మన్ గా నియమితులైన గౌరవనీయులు మాజీ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులుని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపిన వైసీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణకుమారి. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, పైడి ప్రతాప్ గారు,వాసుపల్లి మసేనమ్మ గారు,తదితరులు పాల్గొన్నారు.

# మల్కాపురం సీఐ జిడి బాబును కలిసిన ఏఐటీయూసీ నాయుకులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మల్కాపురం సీఐ జిడి బాబును శనివారం ఏఐటీయూసీ జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. ఏఐటీయూసీ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ సత్తిబాబు, కె. అచ్యుత రావు, ఎ. అజయ్ సీఐ నీ కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం హెచ్ పిసిఎల్ కార్మికుల సమస్యలు పై ఏఐటియుసి నాయకులు సీఐ కు వివరించారు. పారిశ్రామిక ప్రాంతంలో శాంతి భద్రతల పట్ల ఏఐటియుసి సహకరిస్తుందని తెలిపారు.

# నేక్ సంస్థ ద్వారా ఎలక్ట్రీషియన్ శిక్షణ

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ యువతకు ఉపాధి కొరకు ఎలక్ట్రీషియన్ కోర్సులో ప్రధానమంత్రి కౌషల్ వికాస్ యోజన పథకం కింద ఉచిత శిక్షణ, ఉపాధి నిమిత్తము నేరుగా దరఖాస్తులు కోరుతున్నట్లు నేక్ సహాయ సంచాలకులు రవికుమార్ తెలిపారు. అభ్యర్థులు 10 వ తరగతి పాసై 15 సం. నుండి 45 సం.ల వయసు కలవారే ఉండాలన్నారు. 150 గంటల శిక్షణా కాలం ఉంటుందని తెలిపారు. 60 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మాకవరపాలెం "నేక్" శిక్షణా కేంద్రంలో శిక్షణ, స్టేషనరీ ఉచితముగా అందజేయబడు తుందన్నారు. శిక్షణ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో వుంటుందని శిక్షణ పూర్తయిన తర్వాత సంబంధిత రంగంలో (ప్రైవేటు సెక్టారులలో) ఉపాధి కల్పించబడుననీ ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని వివరించారు.

ఆశక్తి గల అభ్యర్థులు 7780275922 లేదా 9394885164 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

# వార్డ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన బొండా



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 87వ వార్డ్ పరిధిలో నిర్వాసిత కాలనీ సాహెబ్ వీధిలో జీవీఎంసీ వారి నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ ను వార్డ్ పార్టీ కార్యకర్తలతో రాష్ట్ర కార్యదర్శి వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాధం (జగన్) పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్ ను కలిసి జరుగుతున్న పనులయొక్క నాణ్యతను అడిగి తెలుసుకోవడం జరిగింది. ముఖ్య అతిధి మాట్లాడుతూ వార్డ్ లో ఉన్న ప్రజలకు అండగా ఉంటూ, వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, వార్డ్ అధ్యక్షులు రాజన్ రాజు, జిల్లా కార్యదర్శులు వర్రే రాంబాబు, కళ్లేపల్లి శ్రీనివాసవర్మ,సీనియర్ నాయకులు రమణమూర్తి,ద్రోణద్రి అప్పలనాయుడు,గెద్దాడ రాంబాబు,గెద్దాడ అప్పారావు,సంద్రాన సూరిబాబు, కడుపుట్ల శ్రీను,గురవయ్య,పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాఢనిద్రలో ఉండగా కాటేసిన పాము.. తండ్రీ, కొడుకు మృతి..



తెలంగాణలోని కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. రాజంపేట మండలం శేర్ శంకర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని మూడుమామిళ్ల తండాలో పాము కాటుతో తండ్రీకొడుకులు.. ఇద్దరూ మృతి చెందారు. రాత్రి కుటుంబమంతా గాఢనిద్ర నిద్రలో ఉండగా ఈ ఘటన జరిగింది. మూడుమామిళ్ల తండాలో శనివారం ఉదయం ఈ విషాద ఘటన జరిగిందని.. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముద్రిచ రవి (40), అతని కుమారుడు వినోద్ (12) శుక్రవారం రాత్రి నిద్రపోతున్నారు. ఈ సమయంలో పాము కొడుకు వినోద్ శరీరంపై నుంచి వెళ్లింది. ఈ సమయంలో గమనించిన వినోద్.. కేకలు వేశాడు. దీంతో అప్రమత్తమైన తండ్రి రవి.. పామును చంపేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో పాము బుసలు కొడుతూ రవిని కూడా కాటేసింది. పాము కాటేసినప్పటికీ.. వారు ఏం కాదంటూ స్థానికంగా దొరికే ఆకు పసరు వేసుకుని ఉన్నారు. ఈ క్రమంలోనే వినోద్ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు.. రవిని కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవి కూడా ప్రాణాలు విడిచాడు.

అయితే, పాము కరిచిన వెంటనే ఆసుపత్రికి తరలించి ఉంటే ఇద్దరూ ప్రాణాలు దక్కేవని.. కానీ అశ్రద్ధ చేయడంతో తండ్రీకొడుకులిద్దరూ మరణించారని తండా వాసులు తెలిపారు. తండ్రికొడుకు ఇద్దరూ పాము కాటుతో మరణించడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## పాఠశాల విద్యాశాఖ అందించిన సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకములు పంపిణీ : కలెక్టర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పాఠశాల విద్యాశాఖ అందించిన సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకములు పంపిణీ రాష్ట్రమంతా జూలై 22న ప్రారంభించిన సందర్భంగా విశాఖపట్నం కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ డాక్టర్ ఏ మల్లికార్జున ఈరోజు స్థానిక జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల శివాజీ పాలెం లో ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల అకాడమిక్ స్టాండర్డ్స్ ని కూడా పరీక్షించారు. వారి వర్క్ బుక్స్ ను కూడా పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ టీచింగ్ కూడా పరిశీలించారు. విద్యార్థులందరూ కలెక్టర్ గారితో ఆనందంగా ప్రశ్నలకు జవాబులు ఇస్తూ పాల్గొన్నారు . విద్యార్థుల ప్రతిస్పందనకు గాను ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. స్కూల్ వేళలోనే కాక ఖాళీ సమయంలో కూడా ప్రతిరోజు అదనపు తరగతుల నిర్వహిస్తున్నందుకు అభినందించారు. అన్ని పాఠశాలలలోను ఈ విధంగా చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిని చంద్రకళ , సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి రామారావు, బాలామణి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు క్రమశిక్షణ, శారీరిక దారుఢ్యం కలిగి ఉండాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ కైలాసగిరి లో స్టాఫ్ పరేడ్ సందర్భంగా, జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ విచ్చేసిన సందర్భంగా ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు సారథ్యంలో పరేడ్ కమాండర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బందితో ఎస్పీ కి గౌరవ వందనం చేశారు. పరేడ్ ను సమీక్షించి సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది క్రమశిక్షణతో ఉంటూ, శారీరిక దారుఢ్యం కలిగి ఉండి, ఎటువంటి విపత్తులను ఎదుర్కొనేందుకైన సంసిద్ధంగా ఉండాలన్నారు. పారిశ్రామిక (ఎస్.ఇ.జెడ్) ప్రాంతంలో జరిగే ప్రమాదాలు, నిరసనలు కార్యక్రమాల బందోబస్తులో లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, రానున్న స్వతంత్ర దినోత్సవ వేడుకలు, ఎన్నికల విధులకు సన్నద్ధంగా ఉండాలని తెలిపారు.ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది వివిఐపి బందోబస్తు, ఎస్కార్ట్ లు, ఖైదీ ఎస్కార్ట్ లు, ధర్నాలు, ర్యాలీలు మరియు రాస్తారోకోలు తదితర భద్రతా విధులు నిర్వహించేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తెలియజేయాలన్నారు.

ఈ రోజు 'గ్రీవెన్స్ డే' సందర్భంగా, రాష్ట్ర డి.జి.పి. శ్రీ కె.వి.రాజేంద్రనాథ్రెడ్డి ఐపీఎస్, ఆదేశాల ప్రకారం, జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఐపీఎస్, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్, కైలాసగిరి నందు ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బందికి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించగా, 08 మంది హాజరు అయి, వారి యొక్క అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీ గారికి విన్నవించుకోగా, ఎస్పీ వారి విన్నపములను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కారించవలసినదిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారుఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డిఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకట్రావు, సతీష్ మరియు అరవింద్ కిషోర్, అర్ఎస్సైలు ఆదినారాయణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు, రాష్ట్ర. డి.జి.పి. కె.వి.రాజేంద్రనాథ్రెడ్డి, ఆదేశాల ప్రకారం, జిల్లా ఎస్పీ.మురళీకృష్ణ .తమ కార్యాలయం నందు జిల్లా పోలీసు సిబ్బందికి, గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.జిల్లా పోలీసు సిబ్బంది, శాఖా పరముగా తమ సమస్యలను నేరుగా ఎస్పీ గారికి వినతులు ఇచ్చేందుకు ఈ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ రోజు జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో 11 మంది పోలీస్ సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయం నందు హాజరు అయి, వారి యొక్క అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీ గారికి విన్నవించుకోగా, ఎస్పీ గారు వారి విన్నపములను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కారించవలసినదిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## కోలాటం ప్రదర్శనలను ప్రభుత్వం గుర్తించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** సాంప్రదాయక సామూహిక ఆట కోలాటం ప్రదర్శనలను గుర్తించాలని ప్రభుత్వానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం (ఎన్వైకె) రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఎన్వైకే నిర్వహించిన యువ ఉత్సవ్-2023 'కోలాటం' ప్రదర్శనలో పాల్గొన్న మహిళా సభ్యులకు సర్టిఫికేట్లును శనివారం గౌరీ పంచాయతన దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోల, ఆట అనే రెండు పదాల కలయిక 'కోలాటం' అన్నారు. కోలాటం అనేది బృందగానంతో కూడిన లలితమైన బృందనృత్యమన్నారు. ఈ ప్రదర్శలు విజయనగర సామ్రాజ్యం కాలంలో ప్రసిద్ధి చెందాయన్నారు. విజయనగరం శిథిలావస్థ, శ్రీ శైలం ప్రాకారపు గోడలపై కోలాటం ఆడుతున్న నర్తకీమణులు శిల్పాలు చరిత్రగా మిగిలాయని కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో ఎన్వైకే జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరావు, శ్రీ గౌరీ పరమేశ్వరీ అమృత వర్షిణి అధ్యక్షుడు పెతకంశెట్టి లక్ష్మీనాయుడు, కార్యదర్శి, గాయకురాలు, శిక్షకురాలు పెతకంశెట్టి సుజాత, శ్రీ నూకాంబికా-1, 2 అమృత వర్షిణి, అంజన్న అమృత వర్షిణి, శ్రీ వెంకటదుర్గ అమృత వర్షిణి, విఘ్నేశ్వర అమృత వర్షిణి, సీతారామ అమృత వర్షిణి ప్రతినిధులు భీశెట్టి భువనేశ్వరి, దాడి మోహిని, కాండ్రేగుల స్రవంతి, మారిశెట్టి ధనలక్ష్మి, కర్రి రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంగా ఉండి పులిని చంపిన గేదెలు



బల్లార్ష: సాధారణంగా 'పులి దాడిలో గేదె మృతి' అనే వార్తలు చూస్తాం. కానీ గేదెలు పులి మీద మూకుమ్మడిగా దాడి చేసి హతమార్చిన అరుదైన ఘటన ఇది. మహారాష్ట్ర అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపూర్ జిల్లా మూల్ తాలూకా పరిసరాల్లో కొంతకాలంగా పులి సంచరిస్తూ.. స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. గురువారం ఉదయం మూల్ తాలూకాలోని ఎస్గావ్ గ్రామ పరిసరాల్లో ఓ పశువుల కాపరిపై దాడికి యత్నించింది. చేతిలో ఉన్న గొడ్డలితో ఎదురు తిరగడంతో త్రుటిలో అతడికి ప్రాణాపాయం తప్పింది. తర్వాత బెంబాడా గ్రామంలోని అటవీ పరిసరాల్లో మేత మేస్తున్న ఆవులు, గేదెలపై పులి దాడి చేసింది. ఈక్రమంలో గేదెలు భయంతో పరుగెత్తకుండా.. ఐకమత్యంగా ఉండి పులిని కొమ్ములతో పొడిచాయి. దీంతో పులి తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం దానిని అటవీశాఖ అధికారులు చంద్రపూర్ తరలించారు. చికిత్స పొందుతూ పులి అదేరోజు రాత్రి చనిపోయిందని అధికారులు పేర్కొన్నారు. గేదెలు పులిని ఎదిరించిన దృశ్యాలను అక్కడే ఉన్న పశువుల కాపరులు తమ ఫోన్లలో బంధించారు. ప్రస్తుతం ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

# క్రీడా స్థలాలు ప్రయివేటుపరం ఆపండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జివియంసి క్రీడాస్థలాలు, స్టేడియంలు ప్రైవేటీకరణ ఆపాలని సిపిఎం పార్టీ విశాఖజిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది. కేంద్రం, రాష్ట్రం, విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లు ఎవరి పరిధిలో వున్న ఆటస్థలాలను స్టేడియంలను ప్రైవేటీకరణకు పూనుకోవడం క్రీడలను, దేశ ప్రతిష్టను ధ్వంసం చేయడమే అవుతుంది

యువతలోని శక్తి సామర్థ్యాలను వెలికితీసి, దేశ ఖ్యాతిని, జాతీయ జండాను విను వీధుల్లో రెపరెపలాడిరచేందుకు క్రీడలు విశిష్ట పాత్ర పోషిస్తున్నాయి. దీనికి ఆయా ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలు నగరపాలక సంస్థలు ప్రజాధనంతో క్రీడామైదానాలు, స్టేడియంలు నిర్మించాయి. తద్వారా వేలాది మంది క్రీడాకారులను దేశానికి అందించాయి. స్పోర్ట్స్ కోటాలు ద్వారా పెద్ద ఎత్తున యువతకు పర్మినెంటు ఉద్యోగాలు కల్పించాయి.

కానీ! ఈ రోజు క్రీడలను కూడా పాలకులు వ్యాపారమయం, రాజకీయమయం చేసేసారు. కనుకనే మనకన్నా రెండు సంవత్సరాల తరువాత స్వాతంత్ర్యం పొందిన మన ప్రక్క దేశం చైనా ప్రపంచ ఒలింపిక్స్ క్రీడల్లో అగ్రరాజ్యం అమెరికాను సహితం సవాల్ చేసి పతకాల పట్టికలో 2వ స్థానం సాధిస్తే 140 కోట్లపై చిలుకు జనాభా గల మన దేశం పతకాల పట్టికలో అవమానకర స్థానంలో వున్నాము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దేశ ప్రతిష్ట కన్నా సంపన్నులకు మరింత సంపదను దోచిపెట్టడమే లక్ష్యంగా వుంది. ఇందుకు క్రీడా మైదానాలు, స్టేడియంలు, స్థలాలు వదలడం లేదు.

కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థలైన వాల్తేరు రైల్వే తన పరిధిలోని స్టేడియంలను, గ్రౌండ్స్‌ను ప్రైవేటు లీజుకు కట్ట బెట్టింది. క్రీడలకు, క్రీడాకారుల తయారీకి నిలయం మరో ప్రభుత్వరంగ సంస్థ విశాఖపట్నం పోర్టు డైమండ్ జూబ్లీ స్టేడియంను లీజుకు ఇచ్చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పే అండ్ ప్లే విధానం తీసుకువచ్చింది. (రుసుము చెల్లించి ఆడుకోండి)కొమ్మాదిలోని క్రీడా సముదాయాన్ని, జిల్లా పరిషత్ ఇండోర్ క్రీడా ప్రాంగణాలను ప్రైవేట్‌పరం చేసింది. ఇక జివియంసి కూడా వీరితో జతకలిసింది. మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ ఏరీనాను ప్రైవేట్‌కు కట్టబెట్టింది. దీని నిర్మాణానికి వినియోగించిన 26 కోట్లు రూ.లు ప్రజలవి. ఎకరాపై చిలుకు భూమి ప్రజలది. దీనిపై పెత్తనం ప్రైవేటుది. యువత, పిల్లలు ఈ క్రీడా మైదానాల్లో ఆడుకోవాలంటే రుసుములు చెల్లించాలి. ఎంతమంది సామాన్య. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు, యువత రుసుములు చెల్లించి ఆడుకోగలరు. క్రీడల్లో తమ ప్రతిభను చాటగలరు. వీరిలో దేశభక్తి ఎలా పెంపొందుతుంది. దేశం కోసం ఆడాలన్న భావన ఎందరికి వస్తుంది. క్రీడా మైదానాలు అందుబాటులో లేకుంటే యువత చెడు మార్గం పట్టే ప్రమాదముంటుంది. నగరంలోని మురికివాడలు, కొండవాలు ప్రాంతాలుతోపాటు అనేక ఏరియాల్లో క్రీడా మైదానాలు లేక యువత, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా మైదానాలు, స్టేడియంలు తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరుతుంటే ! ఉన్న వాటిని పాలకులు దూరం చేస్తున్నారు.

కేంద్ర బిజెపి, రాష్ట్ర వైసిపి ప్రభుత్వాలు ఈ దివాళకోరు విధానాలు యువతను, దేశ ప్రతిష్టను దెబ్బతీసే చర్యలు. యువతలోని శక్తి సామార్థ్యాలను ధ్వంసం చేసే చర్యలు. దీని వలన ప్రపంచ క్రీడల్లో మనం మరింత అధమస్థానానికి పడిపోయే ప్రమాదం వుంటుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జివియంసి క్రీడా స్థలాలు, మైదానాలు, స్టేడియంలు ప్రైవేటీకరణ ఆపాలని సిపిఎం డిమాండ్ చేస్తోన్నది. యువత, విద్యార్థులు, ప్రజలు, ప్రజా సంఘాలు పాలకుల చర్యలను ప్రతిఘటించాలని సిపిఎం పార్టీ పిలుపు నిస్తున్నది.

## ఎల్.కోటలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్

**విజయనగరం:** జిల్లాలో చిరుధాన్యాలు సాగును ప్రోత్సహించడంలో భాగంగా ఎల్.కోట మండలం రేగ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 25న ప్రారంభించనున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి ఆన్ లైన్ ద్వారా ప్రారంభిస్తారు. రూ.4 కోట్ల వ్యయంతో ఏర్పాటైన ఈ యూనిట్ ద్వారా 20 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఈ ప్రాంతంలో చిరు ధాన్యాలు సాగు చేస్తున్న వెయ్యి మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఏర్పాటవుతున్న ఈ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి ఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.

## బీసీ., ఈ.బీసీ. సంచార జాతులకు ఉపకార వేతనాలు

### జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కే.రాజేశ్వరి

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో 9వ తరగతి, లేక, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బీ.సీ.ఈ.బీ.సీ. సంచార జాతులకు చెందిన విద్యార్థులకు పి.ఎం. యశస్వి (పి.ఎం. యంగ్ అచివేమెంట్ స్కాలర్షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రంట్ ఇండియా) ఉపకారవేతనాలు అందించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారిణి కె. రాజేశ్వరి తెలిపారు. విద్యార్థులు https://yet.nta.ac.in లో త ఆగస్టు 10తేది లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అయితే తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలన్నారు.

ఉపకారవేతనాలు పొందేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు తే : 29.09.2023 దీ న నిర్వహించు ప్రవేశ పరీక్ష మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక జరుగుతుందని చెప్పారు.ఈ పథకం లో ఎంపికైన 9వ తరగతి విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.1.25 లక్షలు వరకు కళాశాల, హాస్టల్ ఫీజులకు విడుదల చేస్తారన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ధరఖాస్తు కు తమ ఫోన్ నెంబర్, ఆధర్, ఆధర్ కార్డ్ తో లింకయిన బ్యాంక్ పాస్ పుస్తకం, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. స్కీమ్ పూర్తి వివరాలు https://socialjustice gov.in/scheme, https://yet.nta.ac.in%/ లలో లభించునని వివరించారు.

## అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ జిల్లా బిజెపియేతర రాజకీయ పార్టీలు, అఖిలపక్ష కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తేది : 22-07-2023న సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి ఎం.డి.నజీర్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి వై. కొండయ్య, అమ్‌అద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ ఇ.చంద్రశేఖర్, సిపిఐఎంఎల్ ప్రజాపోరు జిల్లా నాయకులు కె.దేవా, లోక్‌సత్తా జిల్లా నాయకులు జి.సుధీర్‌కుమార్, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావులు మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు, వీరి పోరాటం అత్యంత న్యాయమైనవి. కార్మికుల పోరాటాన్ని విశాఖ జిల్లా అఖిలపక్ష రాజకీయ పార్టీలు, జిల్లా కార్మిక సంఘాలు సంపూర్ణంగా బలపరుస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకోవాలి. అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంపై చర్యలు తీసుకొని, కార్మికుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలి. లేని ఎడల కార్మికుల పోరాటం ఉధృతం అవుతుంది. ఈ స్థితి వస్తే జిల్లా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ఈ కార్మికులకు మద్దతుగా ప్రజలను, ఇతర కార్మికులను సమీకరించి యాజమాన్యం మెడలు వంచక తప్పదని హెచ్చరించారు.

గంగవరం పోర్టు నిర్మాణానికి నిర్వాశితులు తమ ఇళ్లను, భూములను, సముద్రవేట, ఉపాధిని త్యాగం చేసారు. గంగవరం పోర్టు భూములు 1800 ఎకరాలు ప్రజలవి. పోర్టు వస్తే తమకు శాశ్వత ఉపాధి లభించి జీవితాలు సుఖమంతమవుతాయని నిర్వాసితులు కలలుగన్నారు. ఈ కలలను యాజమాన్యం కల్లలు చేసిందని నాయకులు విమర్శించారు.

పోర్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాశితులను యాజమాన్యం మోసం చేసింది. ప్రాధాన్యత లేని పనులను కొంతమంది నిర్వాశితులకు ఇచ్చింది. పర్మినెంటు కార్మికులకిచ్చే జీతాలు ఇస్తామని చెప్పి జిపిఎల్, జిపిఎస్ కార్మికుల పేరుతో అతి తక్కువ జీతాలతో దోపిడీ చేస్తున్నది. 14సం?పైగా పని చేస్తున్న కార్మికులకు నెలకు కేవలం రూ.13,000/- నుండి రూ16,600/- 5సం.లుగా పనిచేస్తున్న వారికి నెలకు

9,000/- రూ.లు నుండి 9,700/- రూ.లు మాత్రమే చెల్లిస్తోంది. ఉద్యోగంలో చేరిన నాటి బేసిక్ నెలకు 3,700/- రూ.లునే నేటికీ కొనసాగించడం యాజమాన్య దోపిడీకి నిదర్శనమని నేతలు విమర్శించారు.

చట్టపరమైన హక్కులు పొందటం, యూనియన్ ఏర్పాటు చేసుకోవడం కార్మికుల హక్కు. దీనిని యాజమాన్యం సహించకపోవడం, కార్మిక నాయకులు, కార్మికులు 29మందిని విధులు నిలిపివేయడం చట్ట విరుద్ధం. దీనిని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు.

అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం గతేడాది 2వేల కోట్ల టర్నోవర్‌లో 700 కోట్లు నికర లాభం ఆర్జించింది. కార్మికులను కష్టాల్లోకి నెట్టింది. గంగవరం, గంట్యాడ, గాజువాక, మల్కాపురం పరిసర ప్రాంతాల ప్రజలకు కాలుష్యాన్ని వెదజల్లి ఆరోగ్యాలను హరిస్తోంది. అదానీ గంగవరం పోర్టు భూముల్లో 1100 ఎకరాల భూములు స్టీల్‌ప్లాంట్‌కు చెందినవి. బకాయిలు పేరుతో స్టీల్‌ప్లాంట్ ముడిసరుకు ఓడలను అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం అడ్డుకోవడం స్టీల్‌ప్లాంట్‌ను కాజేయాలన్న కుట్రలో భాగమేనన్నారు. దీనికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అండదండలు వున్నాయన్నారు.

తను న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తేది :04-07-2023 నుండి కార్మికుల పోరాటం చేస్తున్నారు. అయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గారు విశాఖలో వుండి కూడా బాధ్యత వహించకపోవడం సరికాదన్నారు. యాజమాన్య చట్ట విరుద్ధ చర్యలను నిలువరించి, కార్మికుల న్యాయమైన సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

కార్మికులకు కనీస వేతనం బేసిక్ 22వేలతో పాటు 36వేలు ఇవ్వాలి. 29మంది యూనియన్ నాయకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. చనిపోయిన వారికి తగు నష్ట పరిహారం ఇవ్వాలి. ఇతర కార్మిక చట్టాలు అమలు చేయాలి. కార్మికులపై నిర్భంధం ఆపాలి. కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మికులు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపించాలని డిమాండ్ చేస్తున్నాము. యాజమాన్యం తన మొండి వైఖరి విడనాడకుంటే కార్మికుల, ప్రజల యొక్క ప్రతి ఘటన ఎదుర్కొనక తప్పదని హెచ్చరిస్తున్నాము. అదానీ గంగవరం పోర్టు కార్మికుల న్యాయపోరాటాన్ని బలపరుస్తున్నాము. విజయం సాధించేందుకు కార్మికుల తీసుకొనే ఆందోళనలకు అండగా నిలుస్తామని తెలియజేస్తున్నాము.

విశాఖ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధానకార్యదర్శి బి. నాగభూషణం, హెచ్.ఎం.ఎస్. జిల్లా కార్యదర్శి దొమ్మేటి అప్పారావు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు బి.శశిభూషణరావు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె.మల్లయ్య, సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు పి.వెంకటరెడ్డి, యు.రాజు, వి.క్రిష్ణారావు, ఎఐటియుసి నాయకులు ఎం.మన్మధరావు తదితరులు ప్రసంగిస్తూ కార్మికుల హక్కులు, ఉపాధి రక్షణ కోసం రాజకీయపార్టీలు ముందుకు రావడం కార్మిక వర్గానికి అత్యంత మేలు చేసే చర్యయని అభినందించారు. అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యల పరిష్కరానికి జిల్లాలోని మిగతా కార్మికవర్గాన్ని సమీకరిస్తామని, యాజమాన్యం మెడలు వంచే వరకు అండగా నిలుస్తామని ప్రకటించారు.

తీర్మానం : ఈ సమస్యపై ఈ నెల 24న జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రం సమర్పించాలని ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించాలని సమావేశం తీర్మానించింది. సమస్యను పరిష్కరించకుండా జాప్యం చేయడం వలన కార్మికవర్గం తీవ్ర అసంతృప్తితో ఉన్నారని కార్మికుల సహనం నశించి ఉద్యమం

ఉధృతం చేయకముందే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యంపై చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని సమావేశం డిమాండ్ చేసింది. న్యాయం కోసం పోరాడుతున్న అదానీ గంగవరం పోర్టు కార్మికులకు జిల్లా ప్రజలు, కార్మికులు అండదండగా నిలవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

# ఇంటింటి సర్వేలో తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేలో భాగంగా ఏ తప్పులు లేకుండా ఓటరు జాబితా పూర్తి చేయాలని బిఎల్‌ఓలను జిల్లా కలెక్టర్ డా. ఏ. మల్లికార్జున ఆదేశించారు. శనివారం జీవిఎంసి 23 వ వార్డు నక్కవానిపాలెం, 24 వ వార్డు పాత రేసపువానిపాలెం లో ఇంటింటి సర్వే లో పాల్గొని జిల్లా కలెక్టర్ స్వయంగా ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. ఏ. మల్లికార్జున ఇంటి యజమానులతో మాట్లాడుతూ ఇంటిలో ఎంతమంది ఉన్నారు, 18 సంవత్సరాల వయసు వారు ఎంతమంది ఉన్నారు, ఓటర్ నమోదు చేయించుకున్నారా, తదితర ప్రశ్నలు వేసి ఓటరు జాబితా పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్లను నమోదు చేసి నివేదిక పంపాలని బి ఎల్ ఓ ని ఆదేశించారు. ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు తదితర పూర్తి వివరాలు పొందుపరిచి పూర్తి చేయాలనీ ఆదేశించారు.

శాశ్వతంగా ఒక ఇంటి నుంచి ఇంకొక ఇంటికి మారినప్పుడు కొత్త ఇంటిలో ఓటు నమోదు చేయాలని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2024 జరిగుతుందని అన్నారు. దీనిలో భాగంగా ఈనెల తేదీ 21.07.2023 నుంచి 21.08.2023 వరకు సుమారు 32 రోజుల పాటు బిఎల్వోలు, ఎఈఆర్వోలు , జోనల్ కమిషనర్లు ఎంపీడీవోలు ఇంటింటికి తిరిగి ఓటరు సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఇక్కడ పాల్గొనడం జరిగిందని పేర్కొన్నారు. బి ఎల్ వో ప్రతి ఇంటికి వెళ్లి అక్కడ ఉన్న ఓటరు వివరాలు జాబితాలో పరిశీలించి కొత్తగా ఓటరు గా అర్హత పొందిన వారికి ఫారం-6 అందించి,సమాచారం సేకరించి నమోదు జరుగుతుందని అన్నారు.

ఓటర్లు ఒక ఇంటి నుంచి ఇంకొక ఇంటికి మారినప్పుడు ఫారం-8 అందించి అడ్రస్ మార్చడం జరుగుతుందని తెలిపారు. డూప్లికేట్ ఓట్లుగా ఉన్న వారిని ఫారం-7 లో నమోదు చేసి నోటీస్ ఫారం-13 లేదా14 అందించి తనిఖీ చేసి తొలగించడం జరుగుతుందన్నారు.

అదేవిధంగా ఓటరు ఎపిక్ కార్డులో అడ్రస్సు , పేరు, వయస్సు వంటి మార్పులు, చేర్పులు చేయడం జరుగుతుందన్నారు.అదేవిధంగా 10 ఓటర్లను మించి ఉన్న ఇండ్లను తనిఖీ చేస్తున్నామని అన్నారు. ఒక్కొక్క ఇంటిలో ఒకే డోర్ నంబరుపై మూడు నాలుగు అంతస్తులు ఉన్నందున 10 కి మించి ఓటర్లు ఉంటున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి ఇండ్లలో గతంలో వేరొక చోట అద్దెకు ఉండి ప్రస్తుత ఇంటిలో ఓటు లేనట్లయితే అక్కడ బి ఎల్ ఓ కి సమాచారం అందించి అడ్రెస్స్ మార్పు చేయడం జరుగునని వివరించారు .

రాజకీయ పార్టీల అభ్యర్థులు కూడా బిఎల్ఏ లను నియమించి ఇంటింటికి ఓటరు సర్వేలో బిఎల్ఓ లకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ ఇంటింటికి సర్వేలో ఎఈఆర్వోలు , జోనల్ కమిషనర్లు ఎంపీడీవోలు పాల్గొంటారని అన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఎస్టిసి వెంకటేశ్వర్లు ,అర్బన్ తాసిల్దార్ ఆనంద్ కుమార్, ఎలక్షన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8885687610,
7981904385

## నేడు అనకాపల్లిలో వినియోగదారుల సంఘాల సమావేశం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలోని వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి శ్రీ గౌరీ గ్రంథాలయంలో జరగనున్నదని కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం - 2019కు ప్రచారం, వినియోగదారుల సంఘాల పాత్ర గురించి సమావేశంలో చర్చించడం జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లాలోని వినియోగదారుల సంఘాల ప్రతినిధులంతా హాజరు కావాలని, వివరాలకు 9247166511 మొబైల్ నెంబర్ను సంప్రదించాలని సత్యనారాయణ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సీజనల్ వ్యాధులైన మలేరియా డెంగ్యూ వ్యాప్తిని అరికట్టి, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారు లను ఆదేశించారు. శుక్రవారం ఆమె 8వ జోన్ 95 వ వార్డు పురుషోత్తపురంలోని మహతి స్కూల్ వద్ద సీజనల్ వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం లో వార్డ్ కార్పొరేటర్ ముమ్మన దేవుడు, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ డెంగ్యూ మలేరియా నివారణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నిరంతరం మలేరియా అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు ప్రతి ఇంటిని తనిఖీలు నిర్వహించి మలేరియా డెంగ్యూ కారణమైన దోమల వృత్తిని అరికట్టేందుకు కృషి చేస్తున్నారని ప్రతి చోట సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని, దోమలు నియంత్రణకు మలేరియా సిబ్బంది ఫాగింగు, స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించామన్నారు. డెంగ్యూ కారణమయ్యే ఎడిస్ దోమలు మంచినీటిలోనే వృద్ధి చెందుతాయని అందుకు పరిసరాలలో కొబ్బరి బొండాలు ఖాళీ సీసాలు ఇంట్లో ఫ్రిజ్ వెనుక భాగం లో నీరు, పూల కుండీలు, నీటి తొట్టెలు లలో నీరు నిలవ లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇంట్లో పొడిగా ఉండే విధంగా చూడాలని తద్వారా దోమలను అరికట్టవచ్చు అన్నారు. చెరువులు నీటి కుంటలలో దోమలు ఎక్కువగా వృత్తి చెందుతాయని అందుకు పురుషోత్త పురం లోపల చెరువులో గంబూసియ చేపలు వదిలామని ఇవి దోమల లార్వాను తినేస్తాయని తద్వారా దోమలను అరికట్టవచ్చు అన్నారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, మలేరియా అధికారి సాంబమూర్తి ఇతర జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటి కరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరుబాట



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** శనివారం సేవ్ వైజాగ్ స్టీల్ ప్లాంట్ కాంగ్రెస్ పార్టీ మార్చ్. పాదయాత్ర జింక్ గేట్ నుంచి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ దీక్షా శిబిరం కూర్మన్నపాలెం వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ.అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు కరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరుబాట ముఖ్య అతిథిగా పాల్గొని పాదయాత్ర ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్ పర్సన్ మరియు అరకు వ్యాలీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి. పాచి పెంట శాంతకుమారి మీడియా మిత్రులతో మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో ఆంధ్రులకు ప్రత్యేకంగా విశాఖ హుక్కు ఏర్పాటు చేయడం జరిగింది విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కును చౌకబారుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజెపి పార్టీ కేంద్ర మంత్రులు వీరి మిత్రులకు ఆదానీ. అంబానీలకు అమ్మే ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గము దీనికి బిజెపి పార్టీ అంటే బి అంటే బాబు జె అంటే జగన్ పి. అంటే పవన్ టిడిపి పార్టీ జనసేన పార్టీ వైసిపి పార్టీ నాయకులు విశాఖ హుక్కు ప్రైవేటు కరణ చేస్తుంటే నోరు మెదపకుండా ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు ఆనాడు 32 మంది ప్రాణ త్యాగం చేసి సంపాదించిన విశాఖ ఉక్కు లాభాలలో ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటు కరణ చేయడం వలన ఉద్యోగస్తులు కార్మికులు నష్టపోతారని శాంత కుమారి ఆవేదన వ్యక్తం చేశారు మీడియా ఎవడ్రా కొనేది ఎవడ్రా అమ్మేది అనే నినాదంతో విశాఖ పట్నం మారు మ్రోగింది రాబోయే 2024వ. సంవత్సరములు భారతదేశ ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ తోనే స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సాధ్యపడుతుంది, అని శాంత కుమారి మీడియా మిత్రులకు తెలియజేశారు ఈ పాదయాత్ర సంపూర్ణంగా విజయవంతం జరిగింది ఇప్పటికైనా నరేంద్ర మోడీ గారు విశాఖ హుక్కు ప్రైవేటుకరణ తక్షణమే విరమించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నుండి డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రెటరీ క్రిష్టఫర్ తిలక్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు డుంబ్రిగూడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొల్లోరి దయానిధి. అరకు వ్యాలీ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పాంగి గంగాధర్. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంపారంగి వెంకట్ బాబు గాజువాక కాంగ్రెస్ పార్టీ నాయుకులు ఉక్కు కార్మికులు ఉద్యోగస్తులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెగా బ్రాహ్మణ వివాహ వేదిక
తెలుగు బ్రాహ్మణ వధూవరుల
వివాహ పరిచయ కార్యక్రమం
విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం
9-3-16, పితాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 06-8-2023, (ఆదివారం)
సమయం : మధ్యాహ్నం గం. 2.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.
శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణె వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...
రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు
జనహిత మ్యాట్రిమోనీ
9393949345, 8074541283
Compli

Sugar Free
Fitearly
నడివయస్కులకు దివ్య శక్తి
ఫిట్ ఎర్లీ
थकावट से सत्वर उपसमन
फिट एर्ली
వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?
మందులు మింగలేక, చక్కెరతో కూడిన
ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?
దిగులు చెందకండి.
"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం
శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.
సోయాప్రోటీన్,
వే ప్రోటీన్,
బ్రాహ్మి,
హరితకి,
సీ భక్తారన్,
శొంఠి,
తులసి,
అశ్వగంధ
తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ఠ వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com
HERBINDO LABS PRIVATE LIMITED ®
HEALTH AND HAPPINESS
Compli
HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385.